The Chintamani.

3517

6119
14

A MONTHLY TELUGU MAGAZINE.

Vol. 8.] MADRAS: JULY, 1898. [No. 1.

CONTENTS. 2165

Madras:

Printed and Published for the Proprietor
by N. Brahmanandam Naidu, at the Chintamani Press.

1898.

విషయసూచిక.

THE CHINTAMANI. చింతామణి.

RATES OF SUBSCRIPTION *(Including Postage.)*

For one year *(in advance.)*	Rs. 3-0-0
Single Copy.	,, 0-4-6

For *bonafide* students and village school masters, the annual subscription, if paid in advance, is Rs. 2-6-0 only. In case the subscription is not paid within a month after the commencement of the year, it will be collected by V. P. P.

ADVERTISEMENT RATES.

One page annually Rs.	25-0-0.	One page half yearly.	15-0-0.
Half page ,, ,,	15-0-0.	Half page ,,	10-0-0.
One line single insertion.			0-3-0.

☞ Apply to the Proprietor, Chintamani Press, Porasupakam, Madras.

చందానిర్ణయము. (అంచెకూలితోఁడ)

సంవత్సరమునకు (ముందుగాచెల్లించిన) రు 3—0—0. విడిప్రతియొకటికి 0—4—6.

విద్యార్థులకును పల్లెటూరి యుపాధ్యాయులకును సంవత్సరమునకు ముందుగా పంపినయెడల చందా రెండురూపాయల ఆఱణాలుమాత్రమే. చందా సంవత్సరము ప్రారంభమయిన మాసములోపల పంపనిపక్షమున, తరువాతి సంచికను వాల్యూపేయబిలుగా పంపి సొమ్ము వసూలుచేయఁబడును. వలయువారు చింతామణీ ముద్రాక్షరశాలాధికారిగారికి చెన్నపట్టణము, పరశువాకము, వ్రాసికొనవలయును.

శ్రీ

చింతామణి.

ఇది మాసమునకొకసారి ప్రకటింపఁబడును.

సంపుటము ౫. } చెన్నపురి: విళంబి సంవత్సర ఆషాఢ మాసము. { సంచిక 1.

చింతామణి బహుమానములు.

ఈసంవత్సరము చింతామణిబహుమానములనిమిత్తము రెండువచనప్రబంధములు మాత్రమే పంపఁబడినవి. అందొకటి చింతామణిలోఁ బ్రకటించుట కంతయర్హమైనదిగాఁ గనఁబడలేదు. రెండవదియగు "భక్తి" యను వచనప్రబంధము కొంత మేలైనదిగా నున్నందున, బహుమానమునిమిత్తము దానిని గైకొని యీమాసమునుండియు నిందుఁ బ్రచురించుచున్నాము. పుస్తకము ముగియఁగానే సంవత్సరాంతమునందు గ్రంథకర్తగారికి డునూటయేఁబది పుస్తకములియ్యఁబడును.

విశేష ప్రకటనము.

ఆంధ్రభాషాభిమానులారా! ఈపత్రికయందు నాధునికవచన ప్రబంధాదులను మాత్రమేకాక పూర్వకవిప్రణీతములయిన మంచికావ్యములనుగూడఁ బ్రకటించుచుండుట యెల్లవారు నెఱుఁగుదురుగదా? సుప్రసిద్ధులైన పూర్వసత్కవులచేత రచియింపఁబడి యముద్రితములై యున్న మంచికావ్యములను బ్రచురించుటయే మాయుద్దేశముకాని పూర్వకవిప్రణీతమన్న హేతువుచేత నేదో యొకపద్యకావ్యమును గైకొని యిందుఁ బ్రచురించుచుండుట మాయుద్దేశముకాదు. ఈసంవత్సర మభినవదండి యనుబిరుదాంకముగల కేతనమహాకవిచే రచియింపఁబడినట్టియు, కవిబ్రహ్మయని పేరుపడిన తిక్కనసోమయాజికంకిత మొనర్పఁబడి యాయనచే మెచ్చుకొనఁబడినట్టియు, దశకుమార చరిత్రము నిందుఁ బ్రకటింప నెంచితిమిగాని యిటీవల మాయొద్దనున్న ప్రతికిఁదోడు మఱియొకప్రతి దొరకఁగలదన్నయాశ మామిత్రులొకరువ్రాసిన లేఖవలన మాకుఁ గలిగినం

దునఁ బ్రత్యంతరాపేక్షచే దానినిప్పటికినిలిపియుంచి ముందుగా మాదనగారి మల్లన కృతమైన రాజశేఖరచరిత్రమును బ్రకటింపఁబూనినారము. ఇదియు మాకొక్కప్రతియే లభించినది. దొరకినప్రతియు శుద్ధమయినదికాదు; అక్కడక్కడఁ గొన్ని పదములును పాదములునుబోయియున్నవి; ఇందలియవతారిక బొత్తిగా చెడియున్నది. మేమెంత కృషిచేసినను దీనిప్రత్యంతరమున్నజాడయైన నెక్కడను గానరాలేదు. అందుచేత నింకను నుపేక్షచేసినచో నీయున్నప్రతికూడ నశించునేమోయన్నభీతిచేత నీయుత్తమ కావ్యమును విడువనిష్టములేనివారమయి, సాధ్యమయినంతవఱకుఁ గవిహృదయాను సారముగా లేఖకప్రమాదజనితస్ఖాలిత్యములను సంస్కరించి, పోయినభాగములను వల యితముచేసి పూరించుచు నీరాజశేఖరచరిత్రము నిందుఁబ్రసిద్ధపఱుపఁబూనినారము. ఈప్రబంధముగాని, దశకుమారచరిత్రము, హరవిలాసము, కాకుత్థ్సవిజయము, సుదక్షిణాపరిణయముగాని యెవ్వరియొద్దనైన నున్న పక్షమున దయచేసి వారాపుస్తకమును మాకుఁబంపుదురని వినయపూర్వకముగాఁ బ్రార్థించుచున్నాము. ఈపుస్తకములలో దేనినైనను బంపువారికిఁ బుస్తకము పూర్ణముగా ముద్రింపఁబడినతరువాత నైదుప్రతులను బంపెదము.

SECLUSION.

రా ణి వా స ము.

1. సీ. ఇంగితజ్ఞానంబు భంగంబునొందింప సామ్యంబులేని సత్సాధనంబు
అజ్ఞానతిమిరంబు నాపహింపఁగఁజేయ నసమానమగు సాధనాంతరంబు
నిజగృహోచితకృత్య నిర్మూలనముసేయ ధర సాటిలేని సాధనవరంబు
సహవాససౌఖ్యంబుఁ జయ్యనఁ దొలఁగింప సహకారమగు లసత్సాధనంబు
తే. గీ. పుణ్యబాహ్య ప్రసంగ ప్రబోధకంబు
మహితసద్గుణ సందోహమారణంబు
భూరివిత్తాధికాఘ ప్రపూజితంబు
రాణివాసంబు వలదమ్మ రమణులార!

2. సీ. పరప్రపంచజ్ఞాన వల్లిమతల్లికి డంబుమీఱిన లవిత్రంబు సుండు
శౌర్యధైర్యస్థైర్య జలరాశి నింకింప రంగారు బడబానలంబు సుండు
సంసారవిజ్ఞాన సామజంబును నొంప గమకించు కొదమసింగంబు సుండు
ఐకమత్యంబను నలరులబంతికిఁ దలఁపంగ నగ్నిహోత్రంబు సుండు

తే. గీ. పరకళావృద్ధికిని భంగకరము నుండు
సురుచిరగుణంబుల కెదురుచుక్క నుండు
సతులపాలిటి బ్రహ్మరక్షస్సు నుండు
రాణివాసంబు వలదమ్మ రమణులార!

3. సీ. పరులుచూచిన యంతఁ బరువు మర్యాదలు చెడిపోవునను చింత మిడుకునొకఁడు
గోషాముల్ విడిచిన ద్రోహముల్ గల్గుట నిక్కమను పెనుచింత గ్రుక్కునొకఁడు
తిరుగనిచ్చిన స్వేచ్ఛఁదిరుగుదురను భీతి నహరహంబును జింత నడలునొకఁడు
తనస్వేచ్ఛపోనేమొ యనుచింతసతతంబుఁ గనులఁగాల్వలువాఱ వనరునొకఁడు
తే. గీ. ధరణిమీఁదెత లాలింపఁ దలఁపఁ డొకఁడు
దలఁపుగలవారి దూషింపఁ దలఁచునొకఁడు
దొలఁగఁ జేయంగఁ బరమాత్మఁ దలఁచుకొనుఁడు
రాణివాసంబు వలదమ్మ రమణులార!

4. సీ. రాణివాసముకంటె రమణీయమనవచ్చు వనవాసమెన్నఁగ వనితలకును
రాణివాసముకంటె రంజిల్లుననవచ్చు నజ్ఞాతవాసంబు నతివలకును
రాణివాసముకంటె రాజిల్లుననవచ్చుఁ గారానివాసంబు గరితల...
రాణివాసముకంటె రాణించుననవచ్చుఁ బరలోకవాసంబు ... కును
తే. గీ. రాణివాసంబుమానిన రహి దనర్చు
రాణివాసంబుమానిన లాభ మబ్బు
రాణివాసంబుమానిన రక్తి హెచ్చు
రాణివాసంబువలదమ్మ రమణులార!

5. సీ. వెలలేని సిరులచేఁ దులఁదూఁగుచున్నట్టి ఘనమైన య... ను
గర్భదారిద్ర్యంపుఁ గడలిలోలాడెడి కడగొట్టునాఫ్రి...
నిఖిలవిద్యలచేత నిబిడీకృతంబౌచుఁ గళలూరు నమెరి...
వివిధజాతులతోడ విపులమై విరివియై గ్రాలెడి యూసి...
తే. గీ. ఘనతనొందు నాస్ట్రేలియా ఖండమందుఁ
గొదువదీవులయందును గొండలందు
రాణివాసంబుగానంగ రాదటెందు
నొక్కమనయిండియాయందుఁ దక్క, మఱియు
వచ్చుపుఁ దురకదేశంబులందుఁ దక్క,
రాణివాసంబు వలదమ్మ రమణులార!

రాజమహేంద్రవరము.

ఇట్లు విన్నవించు,
ఒకానొక హితార్థి.

Science Paper Series No. 11.

THE CRUST OF THE EARTH.

భూ స్వ భా వ చ రి త్ర.

భూస్వభావమును గూర్చి ముచ్చటించుటకు ముందు మనము గొన్ని యంశము లూహింప వలసి యుండును. భూమి గుండ్రముగ నిమ్మపండువలె నున్నదనియు, దానిపై భాగము ఎల్లచోట్లను సమముగ నుండక పర్వతముల మూలమున మిట్టపల్లములు తేలి యుండుననియు, భూమియొక్క పైభాగములో మూడువంతులు జలావృతమై యున్న దనియును మనము తెలిసికొన వలసియుండును.

మనము నివసించియుండు గోళమిట్టి స్థితియందే సృజింపఁబడినది కాదు. కాల క్రమమున నీస్థితికి తేఁబడినది. అనేక సహస్ర సంవత్సరములకు పూర్వ మీమండలము అధి కోష్ణము గ... నదై సూర్యుని చుట్టి తిరుగుచుండు నొక పదార్థపుంజముగ నుండెను. ఇట్టిపదా... ము సూర్యునియాకర్షణశక్తి బలిమిచేఁ దగుస్థలమున నుంచఁబడియుండు నది. అగ్ని... యీమండలమునకు పైభాగముననున్న పదార్థము క్రమముగఁ జల్లారి క... ముము నేర్పరచియుండెను. ఆయగ్ని మయమగు ద్రవపదార్థము లిప్పటికి... న కంతర్భాగమునఁ గొంతవరకు మూయఁబడియున్నవి. అక్కాల మున భ... చుట్టు ప్రస్తుతమందున్న వాయుపదార్థముతోఁ గలసి యనే విధము... యుపదార్థము లుండియుండును. కనుకనే ప్రస్తుతమున మన చుట్టు... ను వాయుమార్గమున సూర్యకిరణములు మనలను చేరినట్లు క్కాల... మండలమును జేరియుండ నేరవు. వాయువుతోఁ గలసియుండిన ...ర్థజస్యములగు వాయువులన్నియు సూర్యకిరణములను కప్పివేసి భూమండల ...తురులేకుండఁ జేసియుండును. భూమండలముయొక్క ఉపరిభాగ మెట్లు ...రి యుండునో తెలిసికొనవలెనన్న నీక్రింద వివరింపఁబడిన దృష్టాంతమును సా...నులై పరిశీలించవలయును. ఇట్లు కప్పియుండు వాయువులలో ముఖ్యమయినది ...టియావిరియని చెప్పుదురు.

గుండ్రముగానున్నట్టియు చిన్నదై దట్టముగ నుండునట్టియు తట్టవంటి స్వరూప మును సంపాదించి అందులో నుప్పుజలమును ఉంచవలయును. అందులోనున్న ఉప్పుజలము క్రమముగ నావిరియై తట్టయొక్క రంధ్రములగుండ పైకిలేచును. ఏద్రవ పదార్థముగాని ఆవిరిగా మారవలెనన్నఁ గొంతయుష్ణ సహాయమును పొందవలెను. నీటిని

గాలివంటిదాని యావిరికాదని మన కందరకును స్వానుభవమేకదా. కనుకనే తట్టలోని ఉప్పుజలము ఆవిరి యగునపుడు గొంత యుష్ణమును పొందవలసియుండును. ఇట్టి యుష్ణము మరియొక స్థలమునుండి రాని సమయమున నాయుప్పుజలమునుండి యది స్వీకరింపఁ బడుచుండును. అందువలన కొంతజల మావిరి యయిన వెంటనే మిగిలిన జలము ఉష్ణమును బోఁగొట్టుకొని చల్లారును. ఏనీరుగాని విస్తరించి చల్లారినచో నదిగడ్డ గట్టుకొనుచున్నది. ఇట్లే తట్టలోనిజలము కొంతవరకుఁ జల్లారి ఉప్పై తట్ట కుపరిభాగమున నేర్పడుచున్నది. ఇట్టి స్థితిలో తట్టకుచుట్టును కఠినపదార్థమును లోపలను ద్రవపదార్థమును ఉండి యుండును. కాని యీప్రకారముగ నుప్పు తట్టయొక్క ఉపరిభాగమున నంతటను సమముగ నేర్పడుటలేదు. ఉపరిభాగమున నేర్పడినఉప్పులోని కొన్ని కణములు కొన్ని కొన్నిచోట్ల లోపలకుఁ గ్రుంకుచుండును. అందువలన నక్కడక్కడ సందు లేర్పడుట తటస్థించుచున్నది. ఈసందులను మూయు నిమిత్తము వాని కిరుప్రక్కలనుండు నుప్పు ప్రయత్నించునపుడు ఉపరిభాగమున సర్వత్ర మిట్టపల్లము లేర్పడుచున్నవి. ఒకానొకప్పు డట్టిసందులు మూయఁబడకయే యుండి యుండును. అందుచే నారంధ్రములగుండ లోపలనున్న ద్రవపదార్థము ఆవిరి యగుచు పైకెగయుచుండును. ఈయంశములు స్పష్టముగఁ గన్పట్టినచో భూమండల స్వభావము సులభముగ తేటపడుచున్నది.

ఈతట్టవంటిదే మన భూమండలము. తట్టకుపైని ఏర్పడు కఠినపదార్థమే భూభాగము. అట్టి కఠినపదార్థమువలన నేర్పడు మిట్టపల్లములే భూమండలమందలిపర్వత పంక్తులు. అంతర్భాగమందలి ద్రవపదార్థము లావిరియయి బయలు వెడలుటకు వీలై యుండు సన్నని రంధ్రములే యెత్నా మొదలగు భయంకరములైన యగ్నిపర్వతములు. ఇదియే భూమండల స్వభావము.

భూమండల పదార్థమంతయు నగ్నిమయముగనుండిన సమయము దానిచుట్టును నధికమైన నీటియావిరి వాయువుతో కలసియుండునని ఇదివరలోనే వక్కాణించి యుంటిమిగదా. భూభాగము చల్లారి కఠినమగు పదార్థ మగుతోడనే యీయావిరియుఁ జల్లారును. అందువలన నాయావిరియంతయు నీరై వర్షించి భూభాగమున పల్లపు స్థలములలో గొప్పగొప్ప జలాశయములుగ నేర్పడుచుండును. ఇట్లే సముద్రము లేర్పడినవి. సముద్రజలము భూమిపై నిలిచియుండుటచే వాయువునం దంతగ నీటియావిరి యుండ నేరదు. ఇది తగ్గుటచే వాయువు నిర్మలమై సూర్యకిరణములను చొరనిచ్చును. ఇట్టి సమయముననే జీవకోటికంతటికిని మూలాధారమైన సూర్యకాంతి ప్రసరించి యుండును.

SUMMARY.

అగ్నిమయమగు భూమండల పదార్థము క్రమముగ పైని జల్లారి కఠినమగు భూభాగమైనది. అందువలన నిప్పటికిని నంతర్భాగమున అధికోష్ణముగల ద్రవపదార్థములును వాయుపదార్థములును ఉండియున్నవి. భూభాగము చల్లారిన వెంటనే పైనున్న నీటియావిరి నీరై సముద్రముల నేర్పరచినది. నీటి యావిరి తగ్గుటచే వాయువు నిర్మలత్వముఁజెంది సూర్యకిరణములను ప్రసరింపఁ జేసినది.—

ఆవిరి మొదలగునవి చల్లారి నీరైనప్పుడే యద్భుతమైనట్టి విద్యుచ్ఛక్తి (Electricity) మయమయిన మెరుపులుఁగలిగి యుండును. ఉరుములునుగూడ నప్పుడే ప్రథమమున సంభవించియుండును. అప్పటినుండి ఇప్పటికిని ఇఁక నెన్నటికిని భూమియు సముద్రమును ఒకటినొకటి జయించుటకై యత్నించుచుండును. ఇదివరలో భూభాగముగా నున్నదియిప్పుడు జలముక్రిందను, ఇదివరలో జలము క్రిందనున్నది ఇప్పుడు భూభాగముగను ఉండుట సంభవించుచున్నది.

ఇందులకు నిదర్శనముగ ఆల్ప్స్ (Alps) పర్వతములను దీసికొనియెదము. మిగుల నున్నతమగు పర్వత శిఖరములను వ్రక్కలుచేసి క్రిందుగ పారఁదోలియౌన్నత్యమును రూపుమాపుచున్న మహాశక్తి నీరుగాక మరియేదైనను కద్దా? లేదు. ఇంతియగాక పర్వతముల మధ్య నిలకొనియుండు నీరు అతి శీతమున గడ్డకట్టును. శీతకాలమున ధ్రువసమీప దేశము[illegible]లో నిట్లు సంభవించుచుండును. నీరు గడ్డకట్టినపుడు విరి[illegible] చెందుట తటస్థించును. ఇందువలన పర్వతముల నున్న నీరు గడ్డకట్టి విరివి చెందవలసియుండును. కాని పర్వతములకు మధ్య నట్లు విరివిఁజెందుటకు స్థలముగానక యానీరు తన చుట్టును ఆవరించియున్న పర్వతమును ముక్కలుచేసి వానిని క్రిందికిపారఁదోలును. మార్పు లిట్లు జరుగునపుడు పర్వతములు రూపున మార్పు చెందుననుటకు సందియమేల? ఇట్లే సముద్ర ప్రాంతములఁ గూడ తటస్థించును. ఇందులకు వ్యతిరేకముగ సరస్సులు మొదలగునవి ఎండి కొన్నికొన్నిచోట్ల నెత్తై పచ్చిక స్థలములుగ నేర్పడుచున్నవి. కనుకనే కొన్నిస్థలముల సముద్రభాగము భూభాగమగుట తటస్థించుచుండును. ఇందులకుదాహరణముగ, సహారా (Shahara) యను గొప్పయెడారి కొద్దికాలము క్రిందటనే జలభాగమున కడుగున నుండెనని శాస్త్రజ్ఞులు వక్కాణింతురు.

ఆవిరియంత్రశాస్త్రము.

ప్రథమాధ్యాయము.

ఆవిరియంత్రముయొక్క చారిత్రము.—

ఆవిరియొక్కబలముచేఁ బనిచేసెడు యంత్రము ఆవిరియంత్రమని పిలువఁబడును. అట్టియంత్ర నిర్మాణముంగూర్చి బోధించునదియే ఆవిరియంత్రశాస్త్రము. నీటికి వేడిమిని కలుగఁజేయుటచే నీయావిరి పుట్టుచుండు ననుసంగతి పెల్లరును ఎఱిఁగిన విషయమే! మొట్టమొదట నిట్టియావిరికిఁ బలముగలదని కనిపెట్టిన యాయన సర్ జేమ్సు వాట్టను బుద్ధిశాలి (Sir James Watt). ఈయన 1736వ సంవత్సరమున ఐరోపాఖండమందలి స్కాట్లాండు దేశముయొక్క పడమటిభాగముననున్న గ్రీనక్కు పట్టణములో నొకబీదకుటుంబమున జననమొందెను. ఈవాట్టు తాను పండ్రెండువత్సరముల బాలుఁడుగనున్నపుడు శీతకాలమునం దొకనాటి సాయంకాలమున తేయాకుకై నీటినిఁగాచుచున్న దనయవ్వతోఁ బొయ్యికడఁగూర్చుండఁ దటస్థించెను. ఆసమయమునఁ బొయ్యిపై కాగుచుండిన జలము బాగుగామరుగుటచే నందుండి గుడగుడయను ధ్వని బయలువెడలెను. ఆధ్వనివిని, నివ్వెఱపడి, వాట్టు తనయవ్వ పనులతొందరచేఁ గృహమునం దటునిటు పరుగులిడుచున్నను తానుమాత్రము పొయ్యిదగ్గరనే కూర్చుండియుండి మిక్కిలిశ్రద్ధతోఁ జలపాత్రమువంకఁ జూచుచుండెను.

ఇట్లు కొంతతడవు చూచుసరికి ఆపాత్రనుండి తెల్లనియావిరి గుంపు గుంపుగా బయలువెడలి, పైకెగయుచు, పలుచఁబడి, యదృశ్యమగుచుండెను. మఱియు, నాపాత్రపై మూతవేసినయెడల లోపల నావిరి దట్టముగా కూడుకొని యప్పుడప్పుడు మూతనులేవనెత్తి మధ్యనుండు సందువెంబడిని, ఆవిరి గుప్పుగుప్పున పైకివెడలివచ్చుట కూడ, ఆయనకనిపెట్టెను. ఇట్లు ప్రకృతియందలి స్వాభావిక ధర్మములవలనఁ గల్గు చిత్రములఁజూచి యద్భుతామోదములనొంది యాబాలుఁడిట్లు వితర్కింపఁజొచ్చెను. "ఈశ్వరదత్తములగు స్వాభావిక ధర్మములవలన మనమెంతటి కార్యములనైనఁ జేయవచ్చును. నీటికివేడిమిని కలుగఁజేయుటచేఁ బుట్టెడు నావిరికి కొంతబలముండును. కావున నందువకు మన బుద్ధిబలమునుగూడ తోడుపఱచినచోఁ దానివలన లోకోపయోగకరములగు పెక్కుకార్యములఁ జేయించుకొనవచ్చును." ఇట్లు తదేకచింతతోఁ

కూర్చుండియున్న వాట్టును జూచి యింటివారందఱును "మన వాట్టు పిచ్చివానివలె నెట్లు చూచుచున్నాఁడో చూచితిరా" యని హేళనసేయ నారంభించిరి; గాని వాట్టు మాత్రము తన పట్టువదలక, చిరకాలము పరిశ్రమచేసి, యీ యావిరి యంత్రముం గని పెట్టి కీర్తిప్రతిష్ఠలం గాంచెను. తనకంటఁబడిన యద్భుతము నామూలాగ్రముగఁ బరిశీలించి, పట్టుదలతోఁ బాటుపడుటచే నొక్క బీదబాలుఁడు సహితము ప్రపంచమునంతను స్వర్గతుల్యముగా మార్చఁగల్గెనుగదా!! ఆహా! పట్టుదలఁగలిగి పాటుపడిన నెట్టి ఘనకార్యమునైనఁ జక్కపెట్టుటకు సందియమా?

పిమ్మట మఱికొంతకాలమునకు వరోమార్గపద్ధతిం గనిపెట్టి మిక్కిలి ప్రఖ్యాతిఁ గాంచిన జార్జి స్టీవెన్‌సన్ (George Stephenson) అను నాయననుగూర్చికూడ నిచ్చట నించుక వ్రాయుట యసంగతముగా నెంతురని భావించను.

ఈస్టీవెన్‌సనను నాయన 1781వ సంవత్సరము జూన్ 9వ తేదిని వైలమ్ నగరమునందు జననమొందెను. ఈయన తండ్రియొక్క వేతనము వారమునకుఁ బండ్రెండు షిల్లింగుల కెప్పుడును మించియుండలేదు. ఇంతబీద కుటుంబమునఁ జన్మించినవాఁ డగుటచేతనే స్టీవెన్‌సనునకు బాల్యమునందు విద్యాభ్యాసమునకు వలను పడక, చిన్నతనముననే మిక్కిలి స్వల్పజీతమునకు, ఒక యావిరియంత్రమువద్ద పని చేయుటకై కుదురవలసినవాఁడాయెను. ఐనను, ఈయన తనకృత్యముల నెప్పటికప్పుడు నెరవేర్చుకొనుచు, తీరికకాలమంతయు, నూతన విషయములను నేర్చుకొనుటయందే వినియోగపఱచుచుండుటచే నచిరకాలముననే యావిరియంత్ర విషయములనెల్లఁ గ్రహించి, నిపుణుఁడై క్రొత్తవిషయములం గనిపెట్టఁ బ్రారంభించెను. ఇట్లీయన 1815వ సంవత్సరమున నొక నూతనమగు వరోమార్గ యంత్రమును నిర్మింప మొదలుపెట్టెను; గాని యీపద్ధతిని వాడుకలోనికిం దీసికొనివచ్చి జనులకుఁ బరమ ప్రయోజనకారిగాఁ జేయులోపల నీయనకుఁ బ్రజలవలనను, దొరతనమువారివలనను, కలుగుచువచ్చిన తొందరలు ఈయన ధైర్యసాహసముల నేటివరకును వేనోళుల స్తోత్రములం జేయించుచున్నవి. ఈయన యెంతటి నిర్ధనుఁడైనను, ఎంతటి విద్యావిహీనుఁడయినను, ఒక్క పట్టుదల, పరిశ్రమ, వీటినికలిగియుండుటచేతనే శత్రులనెల్లఁ జయించి తన యుద్దేశములనెల్ల నెరవేర్చి లోకమునకెల్ల నమితోపకారమును గావించి చిరకీర్తిఁ గాంచఁగలిగెను.

పిమ్మట నేటివరకును పెక్కండ్రు బుద్ధిశాలులు బయలువెడలుచుఁ గొంచెమించు మించు మనుష్యులవలనఁ జేయఁబడుచుండెడు ప్రతికార్యమును సాధనాంతరములచే నీయావిరియంత్రముల మూలముననే చేయించుచున్నారు. (సశేషము.)

ఆమెయందు నెంతమాత్రము దోషములేదని స్పష్టమైనది." ఈప్రకారముగా నన్యదేశస్థుఁడగు గ్రంథకారుని సాక్ష్యముండఁగ నహల్యాభాయి నిర్దోషురాలని వేరుగ చెప్పనక్కరలేదుగదా. కొడుకునుజంపిన వదంతి నిజమైనను అది యహల్యాభాయిగారికి భూషణప్రదమేగాని దూషణప్రదముగాదు జనకంటకుఁడగువానిని వధియించుట రాజులకుధర్మము. అట్టిజనకంటకుఁడు సొంతకుమారుఁడైనను, పుత్రప్రేమవదలి జనుల హితము కొఱకు వానినివధియించుట యధిక భూషణాస్పదము.

ఏది యెట్లైనను మాలేరావు గతించుట వలన దేశమునకు బహు మేలైనదనుటకు సందేహములేదు. అటులుగాక యతఁడు జీవించియున్న యెడలతద్దేశీయుల కనేకకష్టములు గలిగి దేశమంతయుఁ బాడయియుండును. అహల్యాభాయిగారి సద్గుణ పుంజము వెలువడుట సంభవించకపోవును. మాలేరావు మృతుఁడైనతోడనే రాజ్య మెవరిపేరిట నడపవలయునోయని విచారణకుఁ బ్రారంభమాయెను. పూనాలోని పేష్వాలు వీరికిఁ బ్రభువులుగనుక వారి కీవర్తమానము దెలియఁజేసిరి. అప్పుడు మాధవరావుగారు పేష్వాగానుండిరి; గాని యధికారమంతయు రాఘోబా దాదాగారి చేతిలో నుండెను. మాధవరా వెప్పుడును న్యాయమార్గప్రవర్తకుఁడై యన్యాయార్జనమునం దిచ్ఛలేక యుండెను. రాఘోబాదాదా మంచివాఁడేగాని యొకానొకప్పు డాయన పిచ్చివాని వలె మూర్ఖకృత్యంబులు చేయుచుండెను. మాలేరావు కాలము చేసినప్పుడు, గంగాధర యశవంతు, అహల్యాభాయికి దివానుగా నుండెను. ఆయన యహల్యాభాయి కిట్లుపదేశించెను. "మీ సగోత్రీకుఁడగు కుఱ్ఱవాని నెవరినైనను దత్తత దీసికొని వానికీ రాజ్యము సమర్పింపుఁడు. వాఁడు పెద్దవాఁడగు వఱకు వానిపేరట నేను రాజ్యమును జూచెదను. మీరు మీకొఱకు కొన్ని గ్రామములు పుచ్చుకొని విశీగా నుండవలసినది. మీరాఁడువారగుటచే మీచేత రాజ్యముచేయుట కానేరదు." ఈమాటలకు నహల్యాభాయి సమ్మతించక తానే రాజ్యము చేసెదనని గంగాధర యశవంతుతోఁ జెప్పెను. స్త్రీయై యిట్లుస్వబుద్ధితో నేరాజ్యముఁ జేయఁదలంపఁగాఁజూచి గంగాధరునకుఁ గోపము వచ్చి, యేదైన నుపాయముపన్ని యామె నవమాన పరుపవలెనని యతఁడు దలఁచెను. ఇట్లు తలఁచి "హోళకరువారి రాజ్యమున కిప్పుడు వారసుదారు లెవరు లేనందున, ఈరాజ్యము మీరస్వాధీనముగాఁ బుచ్చుకొనవచ్చును." అని రాఘోబాకు వ్రాసి పంపెను. రాఘోబా యదివఱకే స్వతంత్ర రాజ్యము కావలయునని కోరుచున్న వాఁడుగనుక, గంగాధర పంతుగారి పత్రికను జూచినతోడనే సైన్య సమేతుఁడై మాళవ దేశముపై దండయాత్రకు వెడలెను. ఈసంగతియంతయు దుఃఖమగ్నయగు అహల్యాభాయి గారికిఁ దెలుపఁగానే యామె ధైర్యమువహలంబించి, భోసలా,గాయక

వాడ్, దాభాడేమొదలగు రాజులకందఱకును గుప్తముగానిట్లువ్రాసిపంపెను. ,,కైలాస వాసులగు మల్హారరావు సుబేదారుగారు శ్రీమంతులకొఱకు (శ్రీమంతులని పేష్వాలకు బిరుదు) ననేక కష్టముల ననుభవించి వారి రాజ్యమును స్థిరపరచిరి. అట్టి సేవకునిమరణా నంతర మతని వంశస్థులమగు మమ్ములను రక్షించి మాచే సేవచేయించుకొనుట శ్రీమంతు లకు ధర్మము. అటులుసేయక వారు మావద్దఁగల యల్పధనమున కాశపడి, మారాజ్య మును గొనుటకు వచ్చుచున్నారు. నేఁడు మారాజ్యముపై దండెత్తి వచ్చినటుల రేపు మీరాజ్యముపైకి రాఁగలరు. కనుక నాకు సహాయముగా మీరు సైన్యములను బంప వలెను." ఇట్లీమె యుత్తరములు పంపఁగానే సంస్థానాధి పతులందఱు తమ సైన్య ముల నామెకు సహాయముగాఁబంపి, తాముసు సహాయమునకు వచ్చెదమని వాగ్దాన ములు చేసిరి. ఇంతలో నహల్యాభాయి మాధవరావు పేష్వావద్దికి రాఘోబా దురుద్దేశ ములను దెలుపుటకయి యొక చారుని బంపెను. అందుపై నాతఁడు ,,నీరాజ్యమును గుఱించి యెవ్వరేని పాపబుద్ధిదలఁచిన యెడల వారినితప్పక దండింతుము" అనిప్రత్యు త్తరముఁ బంపెను. తరువాత శత్రువుల మనమున భయంబుఁ బుట్టించుటకునై యహల్యా భాయి యొక గొప్పరాజసభ చేసి యందున దానిట్లు భాషించెను. ,,నేను అబలనని దలఁపవలదు. నేను భుజముపై బొంగుపెట్టుకొని (అనఁగా శస్త్రిముఁ బుచ్చుకొనక యొక చిన్నకట్టెను దీసికొని యనియర్థము) యుద్ధమునకు బయలుదేరిన పక్షమున శ్రీమంతుల రాజ్యశ్రీకి మోసమురాక మానదు. ఈరాజ్యమును మీపూర్వు లఖండ శౌర్యముచే సంపాదించిరేగాని, యాటపాటలవలన సంపాదించలేదు. కనుకఁ బ్రభువులగువారు మావలన యోగ్యమైన సేవ చేయించుకొనవలయునేగాని, యాశగొట్టు బ్రాహ్మణులు (అనఁగా పేష్వాలు) ధనాశచే మా రాజ్యమును దీసికొనియెదమనిన అటుల గానేరదని వారు దృఢముగా నెఱుఁగవలయును!" అహా! ఏమి యీయుగ్రమైన స్వాభిమానము గల క్షాత్రతేజపు పలుకులు! మహారాష్ట్రి భాషయం దీపలుకులు బహు వీరరస పూరి తములై యున్నవి. కాని యంత వీరరసముతో నాంధ్రమునందు భాషాంతరీకరించు టకు వీలులేదని చింతిల్ల వలసియున్నది. ఈవాక్యములు కొద్ది దినములలోనే దేశ మంతయు వ్యాపించి, రాఘోబా దాదాగారికిని శ్రుతములయ్యెను. కాని గంగాధర పంతుగారి ప్రోత్సాహమువలన రాఘోబాగా రీమాటలను లక్ష్యపెట్టిన వారుకారు. ఇట్లు రాఘోబా యేఁబదివేల సైన్యముతోఁ దన రాజ్యమును సమీపించినాఁడని విని యహల్యాభాయి యతని కిట్లు వర్తమానముచేసెను. ,,స్త్రీతో యుద్ధముఁ జేయుట ధర్మముగాదు. అందువలన మీకపకీర్తియేగాని కీర్తి గలుగనేరదు. మీతో యుద్ధముఁ జేయుటకై నేనును గొప్పసైన్యమును సిద్ధముచేసి యుంచినాను. ఈయుద్ధమందు మీరు

ఓడిపోయిన పక్షమున మీకుతలవంపులు కాఁగలవు. మీరు గెలిచినను, స్త్రీనిజోడించె ననిన యపకీర్తియేగాని, మీకుఁగలుగు లాభములేదు.'' ఇట్లు వర్తమానము వినిని, రాఘోబా సిగ్గుపడి, అపజయము గలుగునేమోయని తలఁచి యహల్యాభాయి గారిని పుత్రమరణమునకై యాదరించుటకు వచ్చుచున్నానేగాని, రాజ్యమును దీసికొనుటకువచ్చుచుండ లేదని వర్తమానముచేసి, సైన్యమంతయు వెనుక నేయుంచి, పరిమితజనులతో నిందూరుకు వెళ్ళి, యహల్యాభాయిని నాదరించి పూనాకు వెళ్ళెను. ఈప్రకారమహల్యాభాయి, భర్తృశ్వశుర పుత్ర మరణశోకమువలన మిక్కిలి చింతపాలైయుండియుఁ దనదుఃఖమునడఁచి, యనేకోపాయముల నాలోచించి రాఘోబావంటియసమాన శూరుని సహితము ఏమియపాయము చేయక వెళ్ళునటులుఁ చేయుటవలన నామెశౌర్య ధైర్యసాహసాది గుణము లసమానములైనవియని చెప్పుటకు సందేహములేదు.

ఇట్లు రాజ్యమునకు సంపూర్ణాధికారము ప్రాప్తమైన తరువాత ౧౭౬౫ వ సంవత్సరమునుండి ౧౭౯౫ వ సంవత్సరమువఱకు, ముప్పది సంవత్సరము లహల్యాభాయి రాజ్యముచేసెను. ఈముప్పది సంవత్సరములలోనే యహల్యాభాయి ఆచంద్రార్కముగా శాశ్వతముగానుండు కీర్తినిసంపాదించుకొనెను. ఆమె తనకుదూరపుబాంధవుఁడగు తుకోజీరావను వానిని తనమంత్రిగా నేర్పరచుకొనెను. దండెత్తిపోవుట, సైన్యములనుగూర్చుట, రాజ్యమునుచోరభయమునుండి కాపాడుట మొదలైన యుద్ధసంబంధమైన పనులన్నియు నితఁడు చూచుచుండెను. రాజ్యములోని కడమసంగతులన్నియు నహల్యాభాయిగారు చూచుచుండిరి. తుకోజీ, యహల్యాభాయిగారిని సొంతతల్లి వలెఁ జూచుచుండెను. అహల్యాభాయిగారును అతనియం దధికవిశ్వాసము గలిగి వర్తింపుచుండిరి. ముప్పదిసంవత్సరములవఱ కిద్దరును రాజ్యముచేసిరి; గాని యంతకాలములో నొకనాడైనను, తుకోజీ యహల్యాభాయిగారి యాజ్ఞను నుల్లంఘించినవాఁడు కాఁడు; అహల్యాభాయియు నతనిని యొకమాటయైనను అనినదికాదు.

అహల్యాభాయిదినచర్య—ఈమెయత్యంత నియమితముగాఁ బనులఁజేయుచుండెను. సోమరితనము అనుమాట యామె స్వప్నమునందైనను లేకపోయెను. ఆమె ప్రతికార్యమును, నియమించుకొనిన సమయముననే తప్పక చేయుచుండెను; గనుక నామెమొదలఁచిన పనులన్నియుఁ దప్పక సిద్ధించుచుండెను. ప్రతిదినము సూర్యోదయమునకుఁ బూర్వమె నిదురమేల్కొని, నిత్యకర్మలను నిర్వర్తించుకొని, స్నానముఁజేసి, సాంతముగా దేవతార్చనముఁ జేయును. పిదపఁ బురాణశ్రవణముచేసి, బ్రాహ్మణులకును, బీదలకును దానధర్మముచేయుచుండెను. తరువాత భోజనముఁజేయును. ఈమె జాతియందు మాంసాహారముచేయుటకు నభ్యంతరము లేకపోయినను, ఈమెమాత్ర మెన్న

దును మాంసమును దిన్నదికాదు. భోజనానంతరము కొద్దిగా వామకుక్షిచేసి, రెండు గంటలకు రాజసభకు వెళ్ళును. అచ్చటికి వెళ్ళి వసూలు మొదలైన లెక్కలు స్వయముగాఁ జూచి, ప్రజల కలహములను బాపి సూర్యాస్తమయమువఱకు నింటికివచ్చును. సాయంకాలము మరల దేవపూజఁజేసి, రాజ్యసంబంధమైన మిగిలిన కార్యములను జక్కపరచి రాత్రిరమారమి పదునొకొండుగంటలకామె నిదురించుచుండెను. అబాధితముగా నిట్టి క్రమము ఆమె మరణకాలమువఱకును జరుగుచుండెను. పండుగలు, ఉపవాసములు, వ్రతములు మొదలైన విశేషదినములు వచ్చినప్పుడుమాత్రము, అహల్యాభాయి దినమంతయు వ్రతములోనే గడుపుచుండెను. సకల నియమములు కేవలబ్రాహ్మణ స్త్రీవలె జరుపుచుండెను. ఆమె రంగుబట్టల నెన్నడును కట్టినదికాదు. ఎల్లప్పుడును స్వచ్ఛమైన తెల్లవస్త్రము నే ధరించుచుండెను. పతిమరణానంతరము భూషణముల నెన్నడును ధరించినదికాదు. హిందూశాస్త్రమునందుఁగల వైధవ్యధర్మముల నన్నిఁటిని దప్పక పాలించుచుండెను. ఇట్టి నియమములన్నియు రమారమి నలువది (40) సంవత్సరములు తప్పక నడిపెను.

<u>ఆమెదానధర్మములు</u>—అహల్యాభాయిగారి కీర్తి యీ దేశమునంతను వ్యాపించుటకు ముఖ్యకారణ మామె ధర్మబుద్ధియే. ఆమె నామము వినఁగానే యమితానందభరితులై మహారాష్ట్రులందఱు ఆమె కనేకాశీర్వచనముల నిచ్చుచున్నారు; ఈమె సామాన్యమైన మానవకోటిలోనిదైనను ఈమెను 'దేవి అహల్యా' యన్న నామముతో సంబోధించుచున్నారు. ఇందుకుఁగారణ మామెధర్మబుద్ధియే. ఈమెను స్తుతియించుట పావనకారకమనియు, నీమెను దలంచినందువలన పాపములు నాశమగుననియు, ననేక మహారాష్ట్రీయులు దలంచుదురు. ఇందున కీమె ధర్మబుద్ధియే కారణము. ఈమెచిహ్నమేమైనను లేని క్షేత్రమేదియు నీభరతఖండమునందు లేదని చెప్పవచ్చును. భరతఖండము క్షేత్రములయొక్కయు, తీర్థములయొక్కయు పుట్టిన యిల్లు. ముప్పదిమూడుకోట్ల దేవతలను బూజించెడి హిందువులదేశమునం దసంఖ్యక్షేత్రములుండుట యొక వింత్రముకాదు. ఈక్షేత్రములలో నహల్యాభాయి శాశ్వతదానములను జేసియున్నది. కనుక నీమె కీర్తివిస్తరించినది. క్రొత్తదేవాలయములఁగట్టించుట, జీర్ణదేవాలయముల నుద్ధరించుట, అన్నసత్రములువేయించుట, దేవతలకు శాశ్వతగంగాభిషేకము జరుగునట్లు బందోబస్తుచేయుట మొదలైన, యామెవస్మిన ధర్మకృత్యము లనేకములు చేసినది. క్షేత్రములలో నీమెపేరిట ధర్మకృత్యము లనేకముగా జరుగుచున్నవి. కేవలము క్షేత్రబ్రాహ్మణులకే యామె దానము చేయుచుండినదికాదు. 'ఆత్మ' యను శబ్దమును విడిచి 'విశ్వమ' ను శబ్దమును ధరించి, స్వకుటుంబమును మఱచి, విశ్వమునే కుటుం

బహుగ నెంచి, స్వబాలకులయందలి యనురాగమును తగ్గించి విశ్వములోని సమస్త ప్రాణికోట్లను తన బాలకులుగానే గ్రహించి, ఆత్మవిషయక దుఃఖమున కేడ్వక విశ్వ విషయక దుఃఖమునకై యశ్రుబిందువులురాల్చుచు, జగమునలనఁ దమకుఁగలిగెడి మానావమానములను లక్ష్యపెట్టక యాజగత్తు యొక్క హితార్థమే జన్మమువ్యయపరచు విశ్వకుటుంబులైన మహాత్ములలోనిది యహల్యాభాయిరైనందున నామె శూద్రులకు, చండాలులకు, పశువులకు, పక్షులకు సదాహితమే చేయుచుండెను! మృతిఁజెందిన పుత్రాదులకొఱకు దుఃఖముగలిగినపుడామె తనకుఁదానే యిట్లుపదేశించుకొనును. "చనిపోయిన కుమారుఁ డొక్కఁడేగాక, నీదుఃఖమునకు, నీయుద్వేగమునకు, నీ ప్రేమకు, నీచింతకుఁబాత్రులైన సుతసంఘ మీవిశ్వమునం దసంఖ్యముగలదు. ఈజగమునం దెందరి దుఃఖమును నివారించిన, నెందరిని సుఖులనుజేసిన, నెందరినిలాలించిన, నెందరిని పాలించిన వారందరు నీకుఁగుమారులే. కనుక నీవువ్యక్తివిషయమైన శోకమును విడువుము. ఇటులుచేసిన దుఃఖితులదుఃఖమును బంచుకొనుటకు, సుఖులసుఖమును వృద్ధిజేయుటకు వనంతస్థలము లెల్లప్పుడును దొరుకును." ఇట్లుయోచించి యహల్యాభాయి విశ్వముయొక్క దుఃఖమును మాన్పుటయందు నాత్మదుఃఖమును మఱచుచుండెను. అనేకాన్నసత్రములను స్థాపించి ప్రతిదినమును సర్వజాతులవారికి ననేకముగా నన్నదానముచేయుచుండెను. కాఁపువారు పక్షులను పొలములలోనికి రానియ్యక తోళ్ళురవ్వెదరనిచూచి, కరుణించి, తనడబ్బుపెట్టి పండినపొలములుకొని పక్షులకొఱకు విడుచుచుండెను! కాఁపులు తమయెడ్లను బహుబాధపెట్టెదరనిచూచి మిక్కిలి జాలిపడి, యహల్యాభాయిచే నియమించిన సేవకులు, కాపులు దున్నునప్పుడు, వారి నాగళ్లనుఆపి, యెడ్లనువిప్పి వానికిమేతయు నీళ్ళనుబెట్టుచుండిరి. మల్హారరావుగారు మరణముఁజెందినప్పుడు నాలుగుకోట్లరూపాయలు భాండాగారమునందుండెను. ఇదియునుగాక యహల్యాభాయిగారి సొంతవ్యయమునకై నాలుగులక్షల యగ్రహారము విడిగానుండెను. ఈధనమంతయు నేర్పుతో నహల్యాభాయి యిట్టిధర్మకృత్యములకై వ్యయపరచుచుండెను.

ఆమెయుగ్రశాసనము—అహల్యాభాయి మహాధార్మికయు, సర్వ భూతములయందు దయగలదియు నయినప్పటికి, నామెయుగ్రశాసనగానుండెను. ఆమెన్యాయబుద్ధియు, సత్యపరాయణతయు బహుఉగ్రముగానుండినవి. తనసేవకులలో నెవ్వరైన నొక తప్పుచేసినయెడల దయదలఁపక ఘోరశిక్షవిధించుచుండెను. ఆమె రాజ్యమునందు నర్మదానదీతీరమునందలి గొండువారు ప్రజలకు నపాయముఁ జేయుచుండిరి. వారికి నామె మొదట తిన్నగా బుద్ధిచెప్పెనుగాని వారు విననందున వారలలో ననేకు

లకుఁ బ్రాణాంతశిక్షవిధించెను. తిండికిలేదని బందిపోటులలోఁ జేరువారికి నామెయుపజీవనమునకు సాధనములఁ జూపుచుండెను. వారికి బంజరుభూములను బీళ్లను నూరక యిచ్చి దున్నుకొని బ్రతుకుఁడని చెప్పెను. ఇఁక నెన్నఁడును బందిపోటులలోఁ గూడమని వారిచే బాసచేయించుకొనును. వారు వచనమును తప్పినయెడల వారికిఘోరశిక్ష విధించును. కనుక నామె రాజ్యమునందు నన్యాయముచేయుటకై లోకులు భయపడుచుండిరి. పెక్కులేల. ఒకానొకసమయమునఁ దుకోజీ సైన్యసమేతుండైయుండినప్పుడేదో యొకతప్పుచేసెనఁట. ఈమాటవినఁగానే యహల్యాభాయి యది నిజమాయని విచారించి, నిజమని తెలిసికొని, „రాజధానియందు సైన్యముతో మీరుండిన యెడలఁ బ్రజలకు మిగులబాధగలుగును; గనుక నిందూరువదలి మీరుసైన్యము నింకొకచోటికిఁ దీసికొనిపొండు" అని తుకోజీని ఆజ్ఞాపించెను. ఈయాజ్ఞ యతఁడు శిరసావహించి తనతప్పునకు క్షమాపణ యడుగుకొనెను. తుకోజీరావుచేసిన యపరాధమేమనఁగా— ఇందూరిపట్టణములోని దేవీచందను గొప్పసాహుకారు, అపుత్రకుఁడై మృతిఁజెందెను. అతని ధనమునకు వారసుదారుఁడెవఁడును లేనందువలన నతని సొత్తంతయు తుకోజీ జప్తుచేసి సర్కారు బొక్కసములోనికిఁజేర్చెను. ఈసంగతి యహల్యాభాయిగారికిఁ దెలిసినతోడనే యామె దేవీచందుభార్యను బిలిపించి, యామెమగని సొత్తంతయు నామెకప్పగించి కుమారుని బెంచుకొని సొత్తుననుభవించుమని చెప్పెను! ఆహా! ఏమి యీమె యౌదార్యమును, న్యాయబుద్ధియు! ఆమె రాజ్యమునందున్న మాండలికరాజులనేకులామెకుఁ గప్పములనిచ్చుచుండిరి. కాని యీమె స్త్రీయైనను, విధవయైనను, ఈమెనుధిక్కరించు నంతధైర్య మెవరికిని లేకపోయెను. ఈమె యుగ్రశాసనమును జూచి యీమెకుఁ ద్వరగా కప్పమియ్యనియెడల నీమె యేమిచేయు నన్నవిచార మెవరికినివచ్చినదికాదు. ఒకసారి ఉదేపూరుయొక్క రాణా యీమె నివారించిన వినక రామపురాయను గ్రామమును దీసికొనుటకు సిద్ధుఁడయ్యెను. ఈసమయమున తుకాజీరావు దక్షిణమున యుద్ధముఁజేయుచుండెను; గాన అహల్యాభాయివద్ద నంతగా సైన్యములేకపోయెను. ఐనను భయపడక అహల్యాభాయి, కొంతసైన్యంబిచ్చి శరీఫభాయీ యను వానిని ఉదేపూరు రాణాపైకిఁ బంపెను. అప్పుడారాణా పరాభవమునుబొంది యహల్యాభాయికి శరణుచొచ్చెను. ఆమె యతనినిక్షమించెను. ముప్పదిసంవత్సరములవఱకు నీమె రాజ్యముఁజేసెను; గాని అంతకాల మీమెతో నెవరును తగవులాడినవారుకారు. మహాదజీశిందావంటి రాజ్యకుశలుఁడును, ఘనశూరుఁడును ఈమెను సదాసన్మానించుచుండెను. స్వరాజ్యమునందేమి, పరరాజ్యమునందేమి యీమెకు బహుమాన్యతయుండెను. ఈమె రాజ్యములోని యధికారులందఱును ఈమెకుఁ జాలభయపడుచుండిరి.

క్షేమదాసను నొకసాహుకా రీమెరాజ్యమున, నపుత్రకుఁడై చనిపోయెను. కమావీస్దా రను అధికారి యీసాహుకారు భార్యను లంచమడిగెను. ఆమె లంచమీయనందున నా యధికారి 'నీధనమంతయు జప్తుచేసెద' నని యామెను భయపెట్టెను. ఈసంగతి తెలిసినతోడనే యహల్యాభాయి యాయధికారిని అధికారమునుండి తొలఁగించెను. క్షేమదాసుభార్యకు దత్తపుత్రుని దీసికొనుట కనుజ్ఞ యొసఁగెను. అత్యుగ్రశాసనము, న్యాయబుద్ధి, భూతదయ మొదలైన పరస్పరవిరుద్ధాభాసంబులైన సద్గుణంబులను గ్రహించుట రాజుల కత్యావశ్యకంబని వేరుగఁజెప్పవలెనా ?

ఆమె స్వభావము—ఇదివఱకు వ్రాసిన వర్ణనవలన నీమె స్వభావమిట్టిదని సహజముగా తేటపడును కాని యొకరెండు గుణములు వర్ణించుట యిదివఱకుఁ బడనందున నిప్పుడు వర్ణించెద. స్త్రీలు సాధారణముగా స్తోత్రప్రియలు. ఈదుర్గుణము స్త్రీల యందే యుండునని కాదు. సామాన్యముగా సర్వజనులును స్తోత్రప్రియులే. అహల్యాభాయిగారియం దీదోషము లేశమైనను లేకయుండెను. ఇందుకుఁ గొన్ని నిదర్శనములు గలవు. ఒకానొక సమయమునం దొక కవి యీమెపై నొక కావ్యము వ్రాసి బహుమతిఁ జెందుటకై యాకావ్యమును దీసికొని యహల్యాభాయి వద్దికి వెళ్ళెను. అప్పు డామె యాకావ్యమును నదిలోఁ బడవైచి యాకవితో నిట్లనియె. "ఓకవివర్యా! అల్పజ్ఞురాల నగునన్ను స్తుతించినందున లాభమేమి? సర్వజ్ఞుఁడైన యీశ్వరుని స్తుతించుమా." ఇట్లు చెప్పి యతనిని పంపివేసెను! ఈమెకుఁ బరధనమునం దాశ లేకుండెనని స్థాపించెడి రెండు ఉదాహరణము లిదివఱకే యియ్యఁబడినవి. ఇంకొక యుదాహరణము వినుఁడు. తాపీదాసు బనారసుదాసులను నిద్దఱన్నదమ్ములు పుత్రులు లేకయే గతప్రాణులైరి. వారికి నాలుగులక్షల రూపాయీల సొత్తుండెను. తాపీదాసుని భార్యయగు మహేశ్వరి యహల్యాభాయిగారి వద్దికివచ్చి "అమ్మా! తమరాజ్యము నందుండి తమ యనుగ్రహమువలన నాభర్తయు, మఱఁదియు సంపాదించినట్టి యీయైశ్వర్యము తమదే. కనుక దీనిని స్వీకరింపుఁడు" అని పలికెను. అప్పు డహల్యాభాయి మహేశ్వరిని జూచి యిట్లనియె "నీభర్తయొక్కయు, మఱఁదియొక్కయు ధనము నీదేగాని నాది గాదు. నీకక్కఱలేని యెడల నీపెనిమిటి పేరుండు నటుల నేదైన గొప్పకార్య మీధనముతోఁ జేయుము." ఆమాటవిని మహేశ్వరి పెనిమిటిపేరట గొప్ప దేవాలయమును, ఏటివద్ద ఘట్టమును గట్టించెనఁట. ఇట్టింటికివచ్చు ధనమును నిరపేక్ష బుద్ధితోఁ ద్రిప్పిన ధన్యాత్మురాలి నెంతకొనియాడినను కొఱఁతయే. ద్వాపర యుగమునందలి యుధిష్ఠిరుని నిస్పృహతను గుఱించి యొక కథ చెప్పెదరు. అర్కాటు పట్టణమును జయించినప్పుడు, క్లైవను ఇంగ్లీషు సైన్యాధిపతి, తనవద్ద దాచనిచ్చిన సొమ్ము ఎవ

రిది వారి కిచ్చినఁట. ఈస్వల్ప ఔదార్యమునకై యింగ్లీషు గ్రంథకారులతనిపై సదా స్తుతిరూపమైన వృష్టిఁ జేయుచున్నారు. కాని యివియన్నియు నహల్యాబాయిగారి యౌదార్యము ముందట తిల్ల కౌదార్యములేయని చెప్పవచ్చును! స్త్రీయయ్యును, గొల్లజాతియయ్యును, ఇంత సదాచార సంపన్నతను, ఇంత శ్రేష్ఠతను, ఇంత యధికారమును సంపాదించిన యహల్యాబాయిని నారీరత్నమని యేల చెప్పఁగూడదు. ఈమె స్వభావమునందు శాంతతయు, సౌమ్యతయు, విశేషముగా నుండెను. గర్వం బీమెను ఎప్పుడును స్పర్శించినదికాదు. కపటమనుమాట యీమె యెఱుఁగనే యెఱుఁగదు; దంభ మింతైనను ఈమెయందు లేకపోయెను; అసత్యభాషణ మెన్నడును జేసినది కాదు. దురాచారమను మాటయు, కాలముయొక్క దురుపయోగమన్న మాటయు నామె స్వప్నమందైనను ఎఱుఁగదు ఈసాధ్వీమణియొక్క యేయే సద్గుణములను అధికముగా వర్ణింపవలయునో నాకుఁ దెలియకున్నది. సర్వ సద్గుణములకు నావాసస్థానమైన యహల్యాబాయియం దీసద్గుణమధికముగా నుండెననియు నీసద్గుణమల్పముగా నుండెననియుఁ జెప్పుటకు వీలులేదు.

ఈవర్ణనయంతయు నతిశయోక్తియని కొందఱనుకొనవచ్చును. అతిశయోక్తులతోఁ గావ్యమును నింపుట మన దేశములోని కవులకు స్వాభావిక ధర్మమైనందున నిట్లనుకొనుట యొక యాశ్చర్యముగాదు. కాని నేను వర్ణించిన దానిలో నతిశయోక్తి యేమియులేదనియు, సత్యమే నిండియున్నదనియుఁ జూపుటకుఁ బరదేశీయుల గ్రంథములోని ప్రమాణముల నిచ్చెదను. మాల్కము దొరవారు తమయితిహాసమునందిట్లు వ్రాసినాఁడు. "అహల్యాబాయితో వైరముఁ జేయుటయు, పనివచ్చినప్పు డామెకు సహాయము చేయకపోవుటయు గోహత్యతో సమానములైన పాపములని సకలమహారాష్ట్రరాజులు దలఁచుచుండిరి." "సకల జనులును ఆమెయందు సమానముగాఁ బూజ్యభావము నుంచుచుండిరి. పేష్వా రామె నెట్లు సన్మానించుచుండిరో యటులనే, హైదరాబాదు నైజామువారును, మైసూరులోని టిప్పు సుల్తానును సన్మానించుచుండిరి. హిందువులవలెనే తురుష్కులును ఈమె దీర్ఘాయువు గావలెననియు నీమె రాజ్యము వృద్ధిఁజెందవలెననియు నీశ్వరుని బ్రార్థించుచుండిరి." "స్త్రీయయ్యును ఈమెయందు దురభిమానములేక యుండెను. స్వధర్మమునం దీమెకు విశేషముగా మూఢభక్తి యున్నను, పరధర్మీయులను బాధపెట్టవలయునన్న యిచ్ఛ యీమెకు లేకపోయెను. ధర్మము నందును, పరమార్థ విచారమందును ఆమె సదా నిమగ్నురాలై యున్నను, ప్రజాకళ్యాణము విషయమై యెన్నడును దుర్లక్ష్యముచేసినదికాదు. అత్యంత దక్షతతోను, కర్తృత్వశక్తితోను, ఆమె రాజ్యమునడిపెను.

శ్రీ విజయనగరమనెడు విద్యానగరము.

ఈసంవత్సరము జనవరి నెలలో నొకమాటును జూన్ నెలలో నొకమాటును, పూర్వకాలమందు విద్యానగరమనియు విజయనగరమనియుఁ బిలువఁబడి యిపుడు హంపినాఁబరఁగు గ్రామంబునకు వెళ్ళియుంటిని. దానిచరిత్రము కొంత నీదిగువను వ్యావహారిక భాషలో సంక్షేపముగ వ్రాయఁదలఁచితిని. దీనికి మాతృక హలాణభాషలో నిటీవల మైసూరులో నిచ్చిన చక్కని యుపన్యాసము.

2. పూర్వకాలమందు విజయనగర సంస్థానము గొప్పదియైనను దానినిగుఱించి సంపూర్ణమైనట్టియు వాస్తవమైనట్టియు చారిత్ర లేదు. అది విచారణీయమే. కనుక మనకు దానినిగుఱించి తెలిసిన విషయము అంత విశ్వసనీయముగాదు, తృప్తికరమునుగాదు.

3. మొదట, కొన్ని రాజ్యములగుఱించి అప్పటికాలపు హిందూకవులు వ్రాసిన గ్రంథములు కొన్ని కనఁబడుచున్నవి. అయితే వీనిలో కవిత్వ చమత్కృతి కొఱకు యథార్థ కథను అలంకరించుటంజేసి యందు కల్పన యెంతయో నిజమెంతయో కనిపెట్టు తత్త్వజిజ్ఞాసుని యత్నము కష్టసాధ్యమే.

4. తర్వాత అప్పటి కాలీనులను గ్రంథకర్తలునగు కొందఱు తురుష్కులు ఈ విషయమును గుఱించి వ్రాసిరి. అందులో ముఖ్యుఁడు ఫెరిష్టా అనువతఁడు. వీరికి హిందువులయందు ప్రేమతక్కువగాన వీరు వ్రాసిన వృత్తాంతములు మహమ్మదీయుల యెడఁల బక్షపాత యుక్తముగా నుండును, గాన అంత నమ్మవలసినవికావు. కనుక నిజమయిన చరిత్రఁ గోరువారికి శిలాతామ్రాది శాసన విజ్ఞానమే ఆధారము. కొన్ని శాసనములు ఛందోబద్ధములైనను, కాల్పనిక కథలను గలవిగావు. నిజమైన సంగతులను గూర్చి రాళ్ళయందు అక్షర రూపకముగా చెక్కఁబట్టి, వాని కర్తలు కారయితలు కారణాంతరముచే నశించినను అవిమాత్రము కాలగతి కింకను లోనుగాక యున్నవి. సాధారణముగ రాజన్యులు దేవబ్రాహ్మణులకు దానమిచ్చునపుడు శిలాశాసనములు వ్రాయించిరి. వానిలో ప్రథమమున దాత అయిన రాజుయొక్క వంశవర్ణన, ప్రతిగృహీత నామము, దానకాలము, దానికి నిమిత్తముకూడ నుండును. బహుకాలములనుండి యున్న శాసనములను బట్టి ఇంచుమించుగా విజయ నగరరాజులయొక్క వంశావళి తెలియఁగలదు. విజయనగర సంస్థానముయొక్క చరిత్రవిషయమై రైస్సుగారు అను శ్వేతముఖులు

శాసనాక్షర విజ్ఞానము అను శాస్త్రమందు మైసూరు దేశమున శ్రమచేసి అనేక శాసనములను వెల్లడిలోకి తెచ్చినారు. అందువల్ల మైసూరు జిల్లాలోనే క్రీస్తుశకము 1344 మొదలు 1704 వరకు లోనుగాఁగల 360 యేండ్లలో 425 విజయనగరపు శాసనములను గనిపెట్టినారు.

5. విజయనగరపు సంస్థానముయొక్క చారిత్రమును సక్రమముగా తెలియఁబరచునవి పైనుడివిన శాసనములేగాక ఆసంస్థాన జీవద్దశలో నితర దేశీయులైన బాటసారులు నిష్పక్షపాతముతో పూస గుచ్చినటుల వ్రాసిన యంశములుగూడ ప్రమాణములు.

6. మఱియు, పూర్వపు మహోన్నతస్థితిని జ్ఞాపకమునకుఁ దెచ్చి మనస్సంతాపకారులగుచు నేటికిని గనఁబడు హంపిలోని విచిత్ర నాశనములుకూడ ప్రత్యభిజ్ఞారూపములయిన ప్రమాణములు.

7. విజయనగరపు విషయమై కథ వ్రాయవలెనను వానికి ఉదాహృతములైన పైమూడే సాధనములు.

8. ఇందు విజయనగర సంస్థానచరిత్ర—దాని ప్రారంభమైన క్రీస్తుశకము 1336 మొదలు దానిలయము కావించిన 1565 వ సంవత్సరములోని తేలుకోట యుద్ధమువరకు మొదట సంక్షేపముగా వ్రాయఁబడును. తరువాత ఇప్పటికిఁ గనఁబడు హంపినాశనములను గుఱించి కొద్దిగా వ్రాయఁబడును.

9. ఈసంస్థానోత్పత్తిని చెప్పఁగాఁ దెలియుటకు 13వ శతాబ్దాంతములోను 14వ శతాబ్దారంభములోను దక్షిణ హిందూస్థానముయొక్క చరిత్రఁ జెప్పుట యావశ్యకము. అది సంక్షేపముగాఁ జెప్పఁబడును.

10. పూర్వకాలమందు దక్షిణ హిందూస్థానమనఁగ, నర్మదా తీరమునకు దక్షిణ భాగము మొదలు కన్యాకుమారివరకు నుండు భరతఖండము. తర్వాత తురుష్కులు నర్మదా కృష్ణవేణి మధ్యనున్న దేశమునకు ప్రభువులై అక్కడ నివసించి ఆదేశమునకే దక్షిణము అని పేరు పెట్టిరి. ఇప్పటికి ఆనామమే వ్యవహారములో నున్నది.

11. 13 వ శతాబ్దాంతమందు తురకలు దక్షిణ దేశమును స్వాధీనము చేసికొనవలెననియు, అందలి ధనము దోచుకొనవలెననియు, నుద్దేశించి దానిపై దండెత్తిరి. ఆకాలములో ఆదేశములోఁ జిన్న చిన్న ప్రభువులుండిరి. వారి యూరుపేర్లు మనకుఁ దెలియు గుర్తులిప్పుడేమి కానరావు. ఆకాలములో 'డియోగిరి' అనియు 'వరంగల్' అనియు రెండు హిందూరాజ్యము లుండెను. దవులతాబాదు అను పేరుగల 'డియో

గిరి మహారాష్ట్రములోని యాదవ సంస్థానమునకు రాజధాని. ఆసంస్థానము మైసూరు దక్షిణమువరకు వ్యాపించెను. 'వరంగల్' తెలుగు నాడు అను నాంధ్రసంస్థానమునకు రాజధాని. అది ఓఢ్రదేశమంతయు హైదరాబాదులోని మద్రాసు ప్రెసిడెన్సిలోని తెలుఁగు జిల్లాలన్నియు వ్యాపించెను. ఇపుడు ఆయుభయ సంస్థానముల మహోన్నతిని సూచించు రాళ్ళగుట్టలు, శిథిలమైన దేవాలయములు కోటబురుజాలు మాత్రమే కాని యితర ప్రత్యభిజ్ఞ లేమియుఁ గానరావు. లక్ష్మీ స్థిరము కాదనుట కిదియొక గుర్తు.

12. పూర్వము దౌలతాబాదునగరము విశాలమైన పట్టణమేగాక గొప్పకోట దుర్గముకూడ కలది. ఇప్పటికి అక్కడి అజంటాగుహలు, ఎల్లోరాగుహలు ప్రాచీన శిల్ప విజ్ఞానమును సూచించుచున్నవి.

13. ఓరగల్లు అను వారంగలులో నిప్పటికిని గోచరమగు కాలువలు పెందలయిన నీటిపనులు దానిపూర్వపు గొప్పస్థితిని తప్పక చెప్పుచున్నవి. ఇంకను అక్కడక్కడ నున్నగుర్తులు దాని మహా పదవిని, అప్పటిదేశస్థుల యభ్యుదయమును, అందువలన తురుష్కులకు గలిగిన యసూయతను, వారి ప్రభువయిన అల్లా వుద్దీన్ కిలిజీయొక్క క్రీ శ. 1294వ సంవత్సరములో డియోగిరిపై దండయాత్రను సూచించుచున్నవి. ఈయేడు మొదలు తురకలు డియోగిరి కోటనుగాఁ జేయుటకు యత్నించిరి. ప్రథమ యత్నమున వారియాశ ఫలింపక పోయినను జాలధనమునుమాత్రము దోచుకొని పోయిరి. తిరిగి అనఁగా 1308వ సంవత్సరములో డియోగిరి మీదికి దండెత్తివచ్చి, యారాజును ఢిల్లీ పాదుషాకు సామంతరాజుగాఁ జేసికొనిరి.

14. తర్వాత నేటిలో వారంగల్ మీదికి ముసలమనులు దండెత్తుటంబట్టి యారాజు ఢిల్లీ పాదుషాకుఁ గప్పముగట్టుటయగాక యేటేట నుంకము చెల్లించుటకు నొడఁబడియెను. అంతటతృప్తినొందక నింకనుదక్షిణమువరకు తురుష్కులువ్యాపింప నుద్దేశించిరి. ఢిల్లీపాదుషాఅయిన అల్లావుద్దీన్‌కు ఇష్టుఁడయిన 'మాలిక్కాఫర్' అను సేనాపతి మైసూరు దేశములోనున్న 'హాస్సన్' జిల్లాలోని హాలిబేడ్అని ప్రకృతనామముగల ద్వారసముద్రము నేలు హోసయులవంశపురాజులలోని బెల్లాలదేవుని క్రీ. శ 1311 వ సంవత్సరమునఁగలసి యతనిని యుద్ధమునందోడించి యతనివిశేషద్రవ్యమునుబుచ్చికొని యతనితో సంధికొప్పుకొనెను.

15. ఇంతకుఁదృప్తినొందక తిరుచనాపల్లి తంజావూరు మలయాళదేశములకుఁ బ్రభువులయిన పాండ్యరాజుల రాజధానియగు మధురాపురంబుపై తురుష్కులు వెడలి, అప్పటి రాజులలో నిద్దరి యన్నదమ్ములకు వైరముండఁగా వారిలో నొకరిపట్టుచేరి

విశేషద్రవ్యముకొనిపోయిరి. దీనినిబట్టిచూడఁగా తురుష్కులకు ద్రవ్యాశయేకాని దేశాశ లేనటుల దెల్లంబగు.

16. క్రీస్తుశకము 1318వ ఏటితుదనుగూడ హిందూరాజా ‘దేవగిరి’ పట్టణము నేలెను. అప్పుడు ఢిల్లినుండి తురకప్రభువువచ్చి యతనికి స్థానభ్రంశముఁ జేసెను

17. అయిదేండ్లయిన తర్వాత వరంగలునకు ‘టోగ్లాకు’ లవల్ల నా గతియే కలిగెను.

18. ఈవిధంబున నీ గొప్పహిందూరాజ్యంబులు తురకప్రభుత్వముచేఁ దిరోహితములు కావలసివచ్చెను. కాని యీగతించిన రెండురాజ్యములలో నొక్కటియగు ‘వరంగల్’ సంస్థానమునుండి దైవవశంబున విజయనగరసంస్థానంబుదయించి 250 సంవత్సరములు ప్రభచే వెలింగి తురకలను దక్షిణమునకు రానియ్యకుండనడ్డగించెను. ఇంచుమించుగా నీసమయముననే అనగా 1347 వ సంవత్సరములో దీనికిఁ బ్రత్యర్థియయిన ‘గుల్బర్గ’ అనుస్థలములో ‘భామినీ’రాజ్యము అను తురకప్రభుత్వముకూడ నుద్భవించెను.

19. విజయనగరపు జన్మముగురించి అరుగాథలుకలవు. వీనిలో నుత్పత్తిని గురించి పరస్పరభేదము లెక్కువగనున్నను దానికి ముఖ్యకారణభూతులయిన వారి విషయ మైకకంఠ్యము నేవహించియున్నవి. వీరు ముగ్గురు. ఎవరన. హరిహరఅను హక్కరాయలు, బుక్కమహీపాలుఁడు, శ్రీవిద్యారణ్యస్వాములను అపరనామముగల సర్వజ్ఞులయిన మాధవాచార్యులు. హక్క, బుక్క, సంగమకుమారులు. శ్రీ విద్యారణ్యులు జ్ఞాననిష్ఠులు, ఐహికాముష్మిక విద్యలయందమితకుశలులు. వీరికిఁ దెలియనివిలేవు. వీరు సంగమ బుక్క హరిహరులమంత్రి. సంగమ అను పేరువారు ఈవంశస్థులలో నిద్దరు రాజులు. వీరిలో నెవనికి మాధవామాత్యులు మంత్రియో నిశ్చయముగఁ దెలియదు. ఎవరికైనను వారి యనుధనము, ప్రజ్ఞావిశేషము, దేవతానుగ్రహము, అమితద్రవ్యము, ఈ సంస్థానాభివృద్ధియందు వినియోగించిరి. హక్క, బుక్కయను వారు సామాన్యపు పాలెగార్లుకారు. కాని మయినూరు సంస్థానీకులగు హొసలప్రభువులకు సామంతప్రభువులయియుండనోపుదురు. వీరివంశావళింజూడ చంద్రవంశస్థులలోని యాదవవంశోత్పన్నులయి నటుల గన్పట్టు.

20. తుంగభద్రా దక్షిణతీరంబున శ్రీ విద్యారణ్యులవారు విద్యానగరంబను పట్టణంబునుగట్టిరి. దానినామమును కొన్ని సంవత్సరముల తరువాత విజయనగరమని మార్చిరి. ఈపట్టణము క్రీ. శ. 1336 వ సంవత్సరము కట్టినటులు చెప్పఁబడుచున్నది. అదిచింత్యము. ఈపట్టణము నలుదిక్కులఁ గొండలతో సమానమైన పెద్దరాళ్ళుండెను. కొన్నిచోట్ల ఒకదానిమీద మతియొకటియుంచినటులఁగన్పట్టు రాళ్లగుట్ట లనేకము

లుండెను. మధ్యమధ్య గుహాలు, రమ్యములయిన లోయలు, వాగులు గన్పట్టు. దీనినే ఇప్పుడు హంపి నాశనమనుదురు. ఇది అతిచిత్రము, విచారకరము, శోధనీయము.

21. వంశస్థులు—ఈ రాజ్యము నేలిన ప్రభువులు మూడువంశములవారు; వారిలో నిద్దఱమాత్రమే ప్రశంశింపఁబడుదురు. ఏలయన రెండవ తెగవారి నాశనముతోనే సంస్థానికుల స్వాతంత్ర్యముగూడఁ బోయెను.

22. మొదటి వంశము—ప్రథమమున విజయనగరపు సింహాసనాధిపతులు హక్క అను హరిహరరాయలు. క్రీ. శ. 1344 వ సంవత్సరములో వారంగల్ నుండి తురకలను దఱిమఁగొట్టిన హిందూప్రభుసంఘములో వీరొకరుగాఁ జెప్పఁబడుచున్నారు. అప్పుడే తులవదేశమనియెడు దక్షిణ కన్నడదేశము విజయనగర సంస్థానాధికారమునకు లోఁబరుపఁబడెను. క్రీ. శ. 1342 వ సంవత్సరములో ధరలదేశమునుఁజూడవచ్చిన "ఇబునబతుటా" అను ఆఫ్రికాబాటసారి హనోరాదేశపు తురకప్రభువు హరిహరరాజునకు సామంతుఁడని వ్రాసెను. అరేబియన్ సముద్రపుటోర దక్షిణకొంకణదేశపు ప్రభువులయిన జైనరాజులుగూడ హరిహరునకు లోఁబడినటులఁ గానఁబడుచున్నది. సామంతరాజుల కప్పములు వసూలుపరచుటకు బర్కూరు అను గ్రామములోను మంగలూరు అను గ్రామములోను నిద్దరధికారులను నియమించిరి. మఱియు హరిహరరాయఁడు భూమిసిస్తును సవరించినట్లు నగుపడుచున్నది. రయితునకు సగముపాలును, భూమిఖావందునకు 4వ పాలును, దైవబ్రాహ్మణులకు 12 వ వంతును, సర్కారునకు 6వ వంతు నిచ్చునటుల నేర్పాటుఁజేసెను. ఇది హిందూధర్మశాస్త్ర సమ్మతము, ప్రాచీనన్యాయముగాని అపూర్వన్యాయముగాదు. భూమిని సరిగా కొలువలేదుగాని దానియందు నాటుటకు కావలసిన విత్తుల మొత్తమునుబట్టి అందాజాగా సాయింపుఁజేసిరి. సర్కారున కియ్యవలసిన పైకముమాత్రము రొక్కముగా చెల్లింపవలసియుండెను. మయిసూరు ప్రదేశమునకు వెలపలనుండిన క్రీ. శ. 1340 వ సంవత్సరపు శాసనము హరిహరుని విషయమైయున్నది. మయిసూరుదేశములో "హోన్నూరు" గ్రామములో నొకరాతిమీద "హరియప్పవొడియర్" పక్షమున యుద్ధముచేసి చడిసినవారి గుఱించి యొక శాసనము గలదు. అది క్రీ. శ. 1346 వ సంవత్సరపుది. కనుక హరియప్ప హరిహరుఁడని శాసనవిజ్ఞానులునుడివిరి.

23. ఈవంశస్థులలో రెండవవారు హరిహరుని తమ్ముఁడైన బుక్కమహీపతి. ఇతఁడు క్రీ. శ. 1358 మొదలు 1374వ సంవత్సరములవరకు రాజ్యముఁజేసెను. అంతకుఁ బూర్వము అనఁగా క్రీ. శ. 1350 వ సంవత్సరము మైసూరు సంస్థానములోని కోలారు డిస్ట్రిక్టులోని "గోరిబిద్నూరు" తాలూకాలోని "హోసపట్టణము"లో నివసించినటుల

చెప్పెదరు. ఇతని రాజ్యకాలముతాలూకు కొన్నిశాసనములు మాత్రము మైసూరులో నున్నవి. ఇతనికి చాలబిరుదులున్నటుల గనఁబడుచున్నవి. జగత్ప్రభువని, ప్రతిపక్ష ధ్వంసియని, ఆజ్ఞోల్లంఘితశాస్త్రి, శ్రీమన్మహా రాజాధిరాజ, పూర్వపశ్చిమ దక్షిణ సముద్రాధీశ, అశ్వపతి, గజపతి, యీలోనుగాఁగల బిరుదులుగలవు. ఈకాలములో తురకలు విజయనగరముమీద రెండుపర్యాయములు దండెత్తిరి. ప్రథమములో (1365-1366) వారుజయించిరి. రెండవపర్యాయము (1378) వారు జితులయిరి. ఈ రాజు చిన్నకొమాళ్లలో నొకఁడు మైసూరునకు దక్షిణమునసుండెడు నంబినగోడు (నీలకంఠేశ్వరపురము) తాలూకానకధిపతిగా 'హడివాడు' గ్రామములోనుండెను. క్రీ. శ. 1368 సంవత్సరమున బుక్కరాయఁడు జైనులకుఁ శ్రీ వైష్ణవులకుఁ గలిగిన మత చర్చను స్వయముగావెళ్ళి పరిష్కరించినట్లు కనఁబడుచున్నది. దీనిని గురించినశాసనము 'శ్రవణబెలగోల' అనుగ్రామములోనున్నది. దానిని శ్రీరామానుజాచార్య శాసనమందురు. ఇతనికి స్వమతాచారము దురభిమానము లేక సర్వమతములయందు సమత్వబుద్ధి యున్నట్లును, ఇతని రాజ్యము ప్రజాసాఖ్యావహముగా నున్నట్లును, ఇందువల్లఁ గనిపించుచున్నది. ఇతని మంత్రి బ్రాహ్మణుఁడు. ఇతని సేనాపతి జైనుఁడు.

24. మూడవరాజు రెండవ హరిహరుఁడు. ఇతఁడు బుక్కని పెద్దకొమారుఁడు. (1380 - 1404) ఇతని కాలములో వీరప్రతాప అనుబిరుదు క్రొత్తగాలభ్యమయినది. ఇతనికాలములో విజయనగర రాజ్యము స్థైర్యమువహించెను. ఇతఁడు దక్షిణము వరకు తన రాజ్యమును వ్యాపింపఁజేయుటకు యత్నించెను. ఇతని శాసనములు హంపి, బేలూరు మొదలుకొని చిట్టలదుర్గము, హరిహర, హస్సాను, ధారువాడ, చెంగల్పట్టు, తిరుచినాపల్లివరకు వ్యాపించెను. 1380వ సంవత్సరములో గోవానుండి తురుష్కులను దఱుమఁగొట్టెను. తండ్రివలెనే శైవ, వైష్ణవ, జైనమతములను సమముగాఁజూచెను. ఇతని కాలములో శ్రీవిద్యారణ్యుల సోదరులును వేదభాష్య కర్తలును అయిన సాయనుఁ డితనికి మంత్రి.

25. నాల్గవరాజు రెండవబుక్కరాయఁడు. అతనికిదేవరాయ ప్రతాప దేవరాయ యని రెండుపేర్లు. (1406-15) ఇతని ముఖ్యమంత్రి మాధవమంత్రి. అతనిపేరున 'తలకాడ' గ్రామమువద్దర కావేరికి నంతెనకట్టఁబడియున్నది. ఇతని కాలములో కర్ణాట, తెలుఁగునాడు మొదలు దక్షిణకొంకణమువరకు ప్రభుత్వమువ్యాపించియుండెను. వీరి ప్రతిపక్షులయిన భామినీ తురక ప్రభువులుకూడఁ బ్రబలులగుటంజేసి వీరి దేశము ఉత్తరమునకు వ్యాపింప లేకపోయెను.

26. తరువాత అయిదవ రాజయిన విజయరాయఁడు రెండు సంవత్సరములు

మాత్రమే రాజ్యముఁ జేసెను. ఇతఁడు అనామకతరువు. ఆరవరాజు దేవరాయలు. ఇతఁడు ప్రముఖుఁడు. ఇతనికి సామంతరాజులు అంగవంగకళింగాద్యధిపతులు. ఇతనికి పదివందలమంది తురకగుఱ్ఱపు తురుపుకలదు. ఇతఁడు 1419 మొదలు 1446 వ సంవత్సరమువరకు రాజ్యముఁ జేసెను. ఇతనికాలములో 'తైమూరు' యొక్క కుమారుఁడయిన 'సామర్కండు' ప్రభువైన 'షారుఖు' సుల్తాన్ ప్రభువునుండి 'అబుదల్ రజఖ్' అను రాయబారివచ్చెను. అతఁడు 1448వ సంవత్సరములో మంగుళూరులోదిగి విజయనగరములో షుమారేడుమాసములుండెను.

27. అతఁడు వక్ష్యమాణరీతిని ఈపట్టణమును వర్ణించెను. "ప్రపంచమందంతట ఇట్టి పట్టణమును నేనుచూడలేదు సరియొకదా, వినిగూడనుండలేదు. దీనికి సప్తప్రాకారములుగలవు. వాని మధ్యమధ్య నిండ్లవరుసలున్నవి. బజార్లు బహువిశాలములుగనున్నవి. వానియందనేకవిధములయిన సువాసనగల పుష్పములు విక్రయింపఁబడును. గులాబీపువ్వులు విశేషము. ఎల్లప్పుడుదొరకును. షరాపులు వజ్రవైడూర్య రత్నములను కెంపులను బాహాటముగ నిర్భీతితో నమ్ముదురు. దేవునిదివానుఖానాలో నున్న ఖోజాలుసమేతు న్యాయపరిపాలనఁజేయుదురు. రాజధనము నేలకొట్లలోఁ బోసియున్నది. ఆకొట్లు, అంచువరకు కరగినబంగారముతో నిండిన బావులవలెనున్నవి. అక్కడ నొకటంకసాలగలదు. అందులో వరహా, అందులో సగము ఖరీదుగల పరతాబ, అందులో పదియారవవంతుగల ఫానము అనుబంగారపు నాణెములను, ఫానమునకు సమానమయిన వెండినాణెము తారుననుదానియు, దానిలో సగమునకు దొరకు జిత్తల్, అను రాగినాణెమును కరగింతురు. ఈనాణెములలోఁ గొన్ని నేటివరకుఁ గనిపించును.

28. తరువాత రాజులిద్దరు. వారుమల్లికార్జునుఁడను రెండవ విజయరాయఁడు (1446-67), విరూపాక్షరాయఁడు (1468-94) అనువారు. వారి యసమర్థతచే విజయనగరమహాస్థితి చాలమట్టుకు మట్ట మయ్యెను. మొదటి వంశము విరూపాక్షునితో సరి.

29. నరసింగవంశము అను రెండవవారు సంస్థానాధిపతులు ఎటుల నయిరో అంత స్పష్టముగాఁ దెలియదు. వారిలో మొదటివారగు నరసింగుఁడు దక్షిణ కొంకణమగు తులవ దేశమునుండివచ్చినటుల నగుపడును. విరూపాక్షుఁడు అపుత్రవంతుఁడగుటంజేసి వానిని దత్తత చేసికొనియుండనోపు. అతఁడు ప్రవీణుఁడై ద్రవిడ దేశమువరకు తన విజయధ్వజమును వ్యాపింపఁజేసి రాయవెల్లూరులోను చంద్రగిరిలోను గట్టి దుర్గములను గట్టెను. మఱియు నతని ప్రభుత్వము బంగాళాఖాతపు టొరనున్న దేశములంతటను వ్యాపించినటుల గానవచ్చుచున్నది. కావేరీ ప్రవాహము వచ్చుచుండఁగా సేనతో దాటి తన శత్రువయిన నాగమంగలుని వశపరచుకొని శ్రీరంగపట్టణమును

స్వాధీనపరచుకొనెను. ఇతని కాలములోనే అనఁగా షుమారు అయిదువందల సంవత్సరముల క్రిందట 'బుడుతకీచులు' అను పోర్చుగీసు దేశస్థులలో నొకఁడగు 'వాస్కోడిగామా' అనువతఁడు ఉడిపి దగ్గరనుండు ద్వీపములలో మొదటఁ జేరెను. క్రీ. శ. 1505వ సంవత్సరములో బుడతకీచులు నరసింగరాయని దేశములో నెక్కడనయినను కోట గట్టుకొనుటకు నతని రాయబారి యాజ్ఞఁ బడసిరి.

30. ఇంతేగాక నరసింగరాయఁడు చాల దైవభక్తి గలవాఁడుగా కనపడుచున్నాఁడు. దక్షిణాదినుండు రామేశ్వరము, శ్రీరంగము మొదలుగాఁగల మహాస్థలములను సేవించినట్లు శాసనములు గన్పట్టుచున్నవి. అతనికి తిప్పాంబ, నాగాంబ, ఓబాంబయను ముగ్గురు భార్యలు. మఱియు నింకెందరు గలరో, వారికి పుత్రులెందరో, స్పష్టముగఁ గానరాకుండెను. కాని ఇటీవల రైసుగారు కనిపెట్టిన తామ్రశాసనమును బట్టి యీవిషయము గొంత తేటయగును. దానివలన నీవంశస్థులలోఁ జివర వారయిన సదాశివరాయఁ డెవరో కూడ తెలియవచ్చుచున్నది. దీనినిబట్టి చూడఁగా నరసింగుని ప్రథమ భార్యయయిన తిప్పాంబకు నరసింహుఁడను కొడుకు గలఁడు. విజయనగరాధీశులలోనే సర్వోత్కృష్టుఁడయిన కృష్ణరాయనిఁగన్న భాగ్యము నాగాంబదయి యున్నది. మూడవ భార్యయయిన ఓబాంబకు రంగక్షితీంద్రుఁడు, అచ్యుతరాయఁడు కలిగెను. రంగక్షితీంద్రుని కొడుకు సదాశివరాయఁడు. సదాశివుని సోదరిని రామరాజున కిచ్చిరి. అతఁడు తేల్కోట విజేతుఁడు.

31. ఇఁకఁ బైననుడివిన ఆంధ్రభోజుఁడయిన కృష్ణరాయని చరితము చెప్పఁబడును. అతఁడు క్రీ. శ. 1484 న జన్మించెను. అతఁడుగొప్పయోధుఁడు, రాజ్యనిర్వాహకుఁడు, ప్రజారంజకుఁడు, సంస్కృతాంధ్ర కర్ణాట భాషోద్ధారకుఁడు. రాజ్యమును యుద్ధమును స్వయముగా నడిపెను. వారు క్రీ. శ. 1512 మొదలు 1530 వరకు ఏకచ్ఛత్రముగఁ దల్లివలె ప్రజలను పాలించెను. అతనిది రామరాజ్య మనవచ్చును. బుడతకీచు గ్రంథకర్తలతనిరాజ్యమునుగుఱించి వ్రాసిరి. యుగంధరసదృశుఁడయిన అప్పాజి మంత్రి కృష్ణరాయని కాలములోను, అతనితండ్రి కాలములోను ప్రజా సంరక్షణ చక్కఁగాఁ జేసెను. దక్షిణ హిందూస్థానములోఁ గృష్ణరాయని ప్రభుశక్తి, ఐశ్వర్యము నిరుపమానములు. తుదకు కృష్ణరాయఁడు కృష్ణ మొదలుకొని కావేరి వరకునుండు దేశమును దోర్బలముచే సంపాదించి పాలించెను. అతనికింద 77 గురు సామంతరాజులుండిరట. వారిలోముఖ్యులు బీజపూరు, గోలకొండ, కూల్బర్గ, మధుర, తంజావూరు, జింగి, చెన్నపట్టణము, వినుకొండ, పెనుకొండ, చిట్టలదుర్గము, రత్నగిరి, ఇక్కేరి, మైసూరు, శ్రీరంగపట్టణము, వెల్లూరు, కృష్ణగిరిలోనుండు రాజులు.

భ క్రీ.

మొదటి ప్రకరణము.

„ఓసీ! హైమవతీ! మన లలితను కాంభుక్తకియ్య నిశ్చయించినావుకావు. నలువది యేండ్లకొకటి రెండేడులు మించినవికాని యేమిపెద్ద? నాకన్నుల ముందర పుట్టి పెరిగినవాఁడు. అదేమిటో! వాని మాటంటే తోకత్రొక్కిన త్రాచులాగున నెగిరి పడియెదవేమి? ఒకపాన్నాడ అగ్రహారములోనె కాదు; ఈచుట్టుపట్టుల వానిపేరంటే గడగడాటు'' అని యిట్లొకనాఁడు సాక్షాజ్జరాదేవతయోయన నొప్పు వర్ధనమ్మ కోడలితో ముచ్చటింప నారంభించెను.

„అత్తా! మీరతని యుబుసు నాయొద్ద తేకుండవమ్మా! వాఁడు మనవంటి తగు మనుష్యుల యిండ్లలోకి రావలసిన మనుష్యుఁడు కాఁడు. అట్టివానితో మనకుసంబంధమేమిటి? అదియునుగాక యింత చిన్నపిల్లను నవతిమీఁద నంత కాలము వెళ్ళినవానికిచ్చి పెండ్లిచేయుటకు మనకేమంతకక్కూరితి వచ్చినది? స్త్రీలతో చనవుగా మాటాడవలసిన మార్దవమును మర్యాదయును గలవాఁడు కాఁడువాఁడు. నేటినుండి వానినిమన యింటికి మెల్లగా రాకుండఁజేయుము.'' అని హైమవతి అత్త కుత్తరమిచ్చెను.

„అయ్యో! వెఱ్ఱిదానా! ఎంతమాటాడినావే! మొన్నగాదటే యిద్దఱు పెండ్లాలతోను కాశీయాత్ర చేసికొనివచ్చినాఁడు? వానివంటిశుద్ధమైన బ్రాహ్మణుఁడున్నాఁడే? వాఁడు మహాభోగి. అందుచేతను వాని ప్రవర్తన బాగుండినట్లు కనఁబడదు. దానికేమి? మగవాఁడుకదా! భాగ్యవంతుఁడు. పదిమంది ముత్తైదువులను పోషించుచున్నాఁడు. మనవంటి మర్యాదకొంపలలో నెంత మృదువుగానుండును! మన లలితను పెండ్లిమాటలాడుటకు వచ్చినపు డెంతమర్యాదగా వచ్చి మాటాడినాఁడు. మొన్న పెండ్లాడిన రుక్మిణి కెంతబంగారము పెట్టినాఁడు! పెద్దమగనిని పెండ్లాడినను రుక్మిణికన్నిముచ్చటలును దీరినవి. మన లలితనె యిచ్చినయెడల నంతకన్న వైభవముగా ముద్దు ముచ్చటలు తీర్చును. నాతో అప్పుడు అన్నియు చెప్పినాఁడు. నీవేమాటయు నియ్యకపోయినప్పుడు వాఁడు ఎన్ని చెప్పిననేమి? ఇంతకును, మనపిల్లకంత యదృష్టమెక్కడ? రుక్మిణి మనలలితతోడి పిల్లయేకదా. చూడు, అప్పుడె కాశీ వెళ్ళుముందరనే నిషేకమయినది. రెండు నెలల క్రిందటనే పెద్దపడచయినది. ఇంకను మన లలితకు మంచి

సంబంధమే కుదురలేదు. ఇంతకును మాజగన్మిత్రుఁడు కాశీనుండి రాలేదుకద? వాఁడు వచ్చినప్పుడు కాని యేసంబంధమును తెలియరాదు." అని వర్ధనమ్మ మరల వాక్రుచ్చెను.

,,అత్తా! నక్కయొకచోట ఈలకొట్టి యొకచోట గారికల్యాణము పాడదు. ఆపాపాత్ముఁడు శాంభుక్త యెంతధనవంతుఁడు కానీ; ఎంత యౌదార్య సాహసములు గలవాఁడు కానీ; ఎంత దేవబ్రాహ్మణ భక్తి గలవాఁడు కానీ; విలువ తక్కువవారిలో లెక్క పెట్టఁదగినవాఁడే. మన లలిత కెక్కడను మంచిసంబంధము కుదురకపోయి నప్పుడు శ్రీహర్షపు పాఠశాలలో వారములు చేసికొనుచు విద్యార్థిగానున్న నారాయణభట్టుచేత, మంగళసూత్రము కట్టించుదము. పూర్వము మీకుమారుఁడు కాశీ యాత్రకు వెళ్ళకముందు అతఁడు కాఁగలవాఁడని మనతో ననుచుండ లేదటమ్మా? భాగ్యాలకెక్కడికి! లలితకన్న మనకెవ్వరున్నారు? మనభాగ్యము దానిది కాదటమ్మా? ఇఁక నాలుగుమాసములలో మీకుమారుఁడు కాశీకివెళ్ళి రెండేడు లగును. ఆయన అయిదేడులును అగునంతకు వచ్చుట తప్పదు. ఆలాగు మొదట నిర్ణయమె. ఇదియునుగాక పిల్ల పెండ్లిమాట మఱచిపోదురా యేమి?" అని హైమవతి నుడివెను.

,,అయ్యో! దానిపూజ యెంత బుగ్గియైనదే! నీకీలాగంటి బుద్ధియేలాగునతోచినది. తల్లి తండ్రి యిల్లులేని విద్యార్థికిచ్చే యింతగారాబముతో పెంచిన పిల్లను ముడిపెట్టుట? నీకాలాగున అనుటకు నోరెలాగున వచ్చినది!" అని ముసలమ్మ ముక్కుమీఁద వేలుంచికొని కోడలి మాటల నీసడించెను.

,,అత్తా! మనకీచర్చ యిప్పుడేల? మీకుమారుఁడు నాలుగైదు మాసములలో వచ్చెదరుకదా? అప్పుడే మన మాలోచించుకొనవచ్చును; గాని, నిన్ననే శాంభుక్త కాశీయాత్రనుండి వచ్చినాఁడు. మీకుమారుఁడుగారి కబురు లేమైనఁ దెలిసినవేమో?

అని యింతమట్టుకుఁ బ్రసంగమునడువఁగా పదునొకండు వత్సరములప్రాయము గల చక్కని కన్నియరైన లలిత వీధిలోనుండి వెక్కివెక్కి యేడ్చుచు వారిని సమీపించెను. వారు కారణము తెలియక యామెను గౌఁగిలించుకొని ,,యేమేతల్లి! ఎందుకే?" అని లోట్రుపాటుతో నడుగుచు బుజ్జగింప నామెయేడ్పు రెట్టించెంగాని రెండుమూడు నిమిషముల వఱకును మాఱుపలుక లేకుండెను. పిమ్మట:—

హైమవతి—అమ్మా! ఎవరైన నిన్నేమైనన్నారాయేమి? ఎవరితోనైన జగడమాడినావాయేమి? ఆలాగున జగడమాడు దానవుకావే నాతల్లీనీవు.

వర్ధ—అమ్మా! లలితా! ఎప్పుడును కంట తడిపెట్టియెఱుఁగవే. ఎందుకేడ్చుచున్నావు? చెప్పవేమి! నాతల్లీ!

తుదకు లలిత గద్గదస్వరముతో ,,అప్పగారు బైరాగులలోఁగలసిపోయినారట!"

అనిపలికి మరల నేడువ నారంభించెను. హైమవతి నిర్జీవప్రతిమవలె గోడనొరగి నిశ్చేష్టురాలై యూరకుండెను. వర్ధనమ్మమాత్రము మొదట లలిత కాంభుక్తగారి యింటి కరిగిన సంగతి తెలియఁగును గనుక నాదుర్వార్త యచటనుండియె తెచ్చినదని నిశ్చయించి నెత్తినోరు గొట్టుకొనుచు వన్నెచిన్నెలతో రాగము పెట్టుచు కాంభుక్తగారి యింటికరిగెను. తనయత్త యట్లరిగినపిమ్మట హైమవతి కొంతసేపటికిఁ దెలివి వచ్చినదియై యొక యరగడియ పూర్తిగ నాలోచించి కూతుతో నిట్లు మాటాడ నారంభించెను:—

"అమ్మా! లలిత! నీకీకబురెలాగునఁ దెలిసినది?"

లలిత—కాంభుక్తగారియింట నందఱును అలాగున ననుకొనుచున్నారు.

హైమ—ఆసంగతి యెన్నాళ్ళక్రిందట జరిగినదను కొనుచున్నారు?

లలిత—ఆఱుమాసములక్రిందట మొట్టకాంభుక్తగారు కాశిలోఁ బ్రవేశించినప్పటికే జరిగినదట. అప్పగారు నిన్నెన్నోమాట లాడినారట.

హైమవతి— వట్టిమాట. ఆకాంభుక్తసంకటము నేనెఱుఁగుదును. వానిమాట యెంతమాత్రమును నమ్మకు. విచారింపకు. సరిగా నాలుగు మాసములక్రిందట మీయప్పగారిని చూచినట్లు మొన్న మన యింట భిక్షకుండిన స్వాములవారు చెప్పినారు కారటే?

కాంభుక్తయొక్క మనఃకౌటిల్య మెఱిఁగినదియె కనుక హైమవతి యతనిమాట కేవల మసత్యమనియును దన భర్త నాలుగు మాసములలోఁ దప్పకుండ నిర్ణయము చొప్పున వచ్చుననియు నిశ్చయించికొని యించుకేనియుఁ గించపడక యుండెను. వర్ధనమ్మకును నట్టి నిబ్బరమును హైమవతి యుపదేశించెనుగాని యది వ్యర్థమగుటచేత, కటకటా, ముసలమ్మ హృదయమున నాదుర్వార్తా శ్రవణారంభముననే బెంగయు నారంభమైనది. కాంభుక్తకు హైమవతియెడ చిరకాలమునుండి రాఁజుచుండిన క్రోధాగ్ని భగ్గునమండుటకుఁ దగిన యవసరమిపుడు గలిగినది.

హైమవతి భర్తయైన జగన్మిత్రశాస్త్రి బాల్యమునుండియు విద్యాభిరుచి గల వాఁడై స్వదేశమున వల్లనైనంత మట్టుకు విద్యనభ్యసించి యిరువదియైదేడుల ప్రాయము నాటికే చుట్టుపట్టులఁ దనంత విద్యాధికుఁడు లేఁడని ప్రసిద్ధికెక్కెను. అంతకుమున్న యతనికిఁ దనపాండిత్యమును వారణాసి నవద్వీపము మొదలయిన విద్యాస్థానములందిరిగి పండితగోష్ఠిచే నభివృద్ధి నొందించికొనుటకు నభిలాష కలిగినది కాని యతనికిఁ దన యస్వతంత్రావస్థలో దారాపత్యానుబంధము దగిలినందున మోహపాశమట్లతనిం గదలనీదయ్యెను. తుదకు తద్దాంపత్యైక ఫలమైన పుత్రికారత్నమేఁడేడుల యీడునకుండ నక్కన్నియను ధారపోయునాటి కయిదేడులలోఁ దాను మరలవచ్చుటకు నిర్ణయ

మొనరించి యనుకూలిని యైన ప్రియకాంత యంగీకారమును బడసి స్వదేశమును విడిచెను. అంతకుమున్ను కాంభుక్తయు జగన్మిత్రశాస్త్రియు ప్రాయము మించుచుండిన కొలఁది వృత్తియు స్వభావమును మాఱుచుండిన వారయ్యును బాల్యస్నేహితులుగనుక నొకరియింటనొకరు రాకపోకలు గావించుచునే యుండిరికాని పరస్పరస్పర్ధలు గలవారుకారు. వారివారి స్త్రీలకును స్నేహముల్లె యుండెను. జగన్మిత్రశాస్త్రిగారి యొక్క ప్రవాసారంభముననే రెండు కుటుంబములకును నితరేతరము నించుక స్పర్ధ యంకురించెను. తుదకాస్పర్ధ వివర్ధమానయై హైమవతికి భుక్తగారి కుటుంబములో నెవరితోడను మాటలులేక యామె భుక్తగారి పేరువినుట కసహ్యపడునంతమట్టుకుఁ గొనసాగెను. ఇట్లు మూడేడులు కాఁగా కాంభుక్త ధర్మపత్నియందు సంతతిలేక మఱి యొక కన్నియం బరిగ్రహించి మఱియొక వత్సరమునకు నాయిరువురు భార్యలతోడను నతఁడు గంగావగాహనము నిమిత్తమున కాశికి నరిగి యచటనుండిన జగన్మిత్రశాస్త్రిని గలసికొని భార్యతోనతఁడు వికటించుటకో లేక యామెయెడ నతని మోహపాశము దెగుటకో యేదోగట్టిగా నభిమంత్రించి వచ్చి యిచటఁగూడ నతనియెడ హైమవతి యొక్క యాశాపాశముత్రెంగ నిట్లు వార్తాసాధనము నుపయోగించెను. భుక్తగారు దెచ్చినవార్త నొక్క హైమవతియుఁ గూఁతురును దప్ప విన్నవారిలో నమ్మనివారు లేరు. జగన్మిత్రశాస్త్రికి స్వదేశమున భార్య, తల్లి, కూఁతురును దక్క మఱియెవరును బంధువులులేరు. శాస్త్రిగారితల్లి యతనిఁగూర్చిన యాదుర్వార్త వినిననాటనుండియు బెంగఁబెట్టుకొని మూడుమాసములలో కాలధర్మమునందెను. శాస్త్రిగారికి గాఢమైన మిత్రసముదయమున్నను భుక్తగారి దుర్బోధనుబట్టి యతని ప్రాబల్యమునకడలి యనాథ యయిన యా హైమవతియెడ నెంతయభిమానము గలవారయ్యును నెందొక్కఁడే నియు నామెకు సహాయపడవెఱచెను. ఇట్లీకాకిని యైనను హైమవతి ప్రాణముల కన్న విలువగ కూఁతు సంరక్షించుచుఁ గూతుకన్నను విలువగ శీలమును గాపాడు కొనుచు లోకులయొక్క గుసగుసలఁ బెడచెవులఁబెట్టుకొని భర్తయొక్క రాకంగూర్చి గడియ యొక యేడుగానెన్నుచు నతఁడు దన్నెడఁబాయునపు డొసఁగిన గడువునకు దినముల లెక్కపెట్టుకొనుచుండెను. క్రమముగా నామె భర్తయిడిన గడువులన్నియు మించినవి; అతఁడు రాలేదు. వచ్చుజాడయుఁదోచలేదు. అట్టిసంగతిలో నామె ధైర్యమును మాత్రమువదలక పుత్రికఁ బెంగపెట్టుకొనకుండ లాలించుచు నదియంతయు భుక్తయొక్క కృత్రిమమువలన నచ్చినపాటుగా నిశ్చయించి యతని రాకయందు నిరాశ భూతురాలుగాలేదు.

సంగతులిట్లుండ లలితకుఁ బెండ్లియీడుమించుచుండెను. శాస్త్రిగారి ప్రసిద్ధిని

బట్టియు సలక్షణరైన కన్నియ యాభిజాత్యమునుబట్టియు మండవారితో పెండ్లి మాటలాడుటయు యెంతో గౌరవముగా నెన్నువారె యిప్పుడు మండవారి యింటిదారిని నడువ వెఱచుచుండిరి. కటకటా! శీలము నర్థముకన్నను ప్రాణముకన్నను నధికముగాఁ గాపాడుకొనుచుండినను, దనయందు వేలుమడఁచి లెక్కించుటకొక్కటయిన దుర్గుణము లేకపోయినను దురాచారవతిగాఁ బరిగణింపఁబడుచుండి లోకముచేఁ గులభ్రష్టగా నీహైమవతి యనాదరింపఁబడుట యెంతయుఁ జింతిలవలసిన సంగతికదా! తుదకు పరిగ్రహణార్హ సకల లక్షణసంపత్తిగల లలితను శాఖానికృష్టుఁడైనను పరిగ్రహించుటకు జంకుచుండ నామె కన్యాత్వముననే రజస్వలయ్యెను.

రెండవ ప్రకరణము.

మెట్టకాంభుక్తగారు, పాన్నాడాగ్రహారమున నెల్ల మిక్కిలి ప్రజావశ్యము గలవాఁడు. ఎప్పుడును నతనివెంట లోచన సంజ్ఞామాత్రన నెట్టి సాహసకృత్యమునకైనను ముందునడుచువారై నలువదికిఁదక్కువకాని విప్రమాణవకులు నడుముగట్టి తిరుగుచుందురు. వారిలో నెల్ల భుక్తగారునమ్మిన వెత్తిమగటిమియు జెత్తితెగువయుఁగలవారిరువురు. జెడ్డుఆనందము, ఇతని పెదతండ్రికొడుకు విశ్వేశము; ఇద్దఱును గ్రామముననెల్ల గొప్ప మల్లులని పేరుపడసినవారు. మొదట నించుక పాపభీతిగలిగి భుక్తగారు నియమించిన క్రూరకృత్యములకెల్ల నిరువురును జంకుచుండువారేకాని, మిక్కిలి బీదలైనవారి యట్టిజంకునుగ్రమముగా భుక్తగారు విశేషధనవ్యయమునఁ దొలఁగించెను. కాంభుక్త దీర్ఘక్రోధి; క్రూరస్వభావుఁడు; కార్యవాది. ధూర్తలక్షణములన్నియు నతనియందొక్కటియైనఁ దక్కువగాకుండఁ బూర్తిగాఁబట్టినవి. రహస్యప్రవర్తనలో వింతకన్న నధముఁడెక్కడనో కాని యుండఁడని యీచరిత్రఁ జదువువారికి ముందుముందు బోధపడునుగనుక దానింగూర్చి యిచటవ్రాయ నక్కఱలేదు అతనివయస్సు ముప్పదియాఱునకు లోపు. శరీరము నిసర్గపాటవము గలది యగుటచేత నతని యారోగ్యమును నవ్యాజ సౌందర్యమును నతనిచరిత్రమును మనమందికొనిన యీనాటికింకను నతని దుష్ప్రవర్తనచేతఁ జెడుటకు నారంభించలేదు.

ఒకనాఁడు రాత్రి భోజనానంతరమున నానందమును విశ్వేశమును భుక్తగారి యనుజ్ఞను మన్నించుటకు వచ్చినపుడతఁడొక మంచముమీఁద భార్యలిరువురును జెరియొక పంకను గాలులువిసరుచుం దటాలునలేచి యచటనుండి తొలఁగినపిమ్మట వారిట్టి సంభాషణయందు వినోదింపసాగిరి:—

భక్త—ఔరా! ఆనందుగా! మఱుదలికింకను రాగిడిచంద్రపంకను జేయించ లేదటరా? అందుకానన్న మొన్న నలువదిరూకలు బదులడిగినావు! నీకేమిరా నా యొద్ద నింత మోమోటము?

ఆనం—అన్నయ్యగారు! ఊబునుపోక యడిగినానుకాని నిజముగామీరు దయ చేయించుటయే తటస్థించిన యెడల నేనెట్లుబదులు తీర్చుట?

భక్త—ఓరితమ్ముఁడ! తీర్చకుంటే నీకంత గండకత్తెరఁ బెట్టినానురా! మనచోట నాలాగుననవద్దు. క్రిందటిమాఱు నీపునస్సంధాన ముహూర్తమునకు నూఱురూకలిచ్చి నానుగానటరా? మొందట మనమది బదు లనుకోలేదా? నీవునాకందుకు ముక్కవ్రాసినట్టె జ్ఞాపకము. మూడేండ్లయినది నిన్నెప్పుడైన నడిగినానా? తీర్చలేదని మఱియొకలాగున ననుకోకు. మేపుచున్నామని యూవుపొదుగుఁగోసి పాలుద్రావెదరా?

ఆనం—అన్నగారు! మీరుపోషించుచున్నారని యెన్నింటికి మిమ్మును బాధ పెట్టుదును? నాకుమొక్కసము నుండీ.

భక్త—మనచోటనాలాగున మొక్కసముపడకురా అని యెన్నిమార్లన్నాను?

ఆనం—చిత్తము; చిత్తము.

విశ్వేశ—అన్నయ్యగారు! నావివాహమునకు దయచేయించిన నూఱు రూకల లోను సగమిప్పుడు జాగ్రతపెట్టినాను. పద్దుతీసి వడ్డిలెక్కచూచి చెల్లుపెట్టించెదరా?

కాంభక్త—విస్సా! నిన్నెప్పుడైన తొందరపెట్టినానురా? ఏమినీకంతగొంతుక కోత? తొందరపడకు నేనునీదగ్గిర వడ్డి పుచ్చుకోను.

విశ్వేశ—మీరుతొందర పెట్టినారనఁగలనా? ఎంతమాట! నాబరువు తీర్చి కొనుటకు—

కాం—విస్సా! తెల్లవారలేచిన మన మెప్పుడును నీవ్యవహారపుమాటలతోనే యుందుము. ఆమాటలకేమి? నేను మీయిద్దఱితోఁ జెప్పినసంగతి యేమయినది? ఇఁక నా యింతపిసరు అడ్డును తేలిపోయినదికదా! ఆగుంట లలితరజస్వలరైనదట! ఇఁక నా ముండకూఁతు లిరువురును సముద్రగామినులు కావలెను. లేదా, వేశ్యావృత్తి నవలం బించవలెను. ఇప్పుడైన నామాట నిరాకరించినందుకు హైమవతి పశ్చాత్తాప పడు చున్నదా?

విశ్వేశ—ఏమి మనవిచేయుదు మన్నయ్యగారు! ఆయుత్తమురాండ్రిరువురును నగ్ని హోత్రమువంటివారు. మేమువెళ్లఁగానే 'అన్నలారా! కూర్చుండుఁడు' అని మాకు వేదాంతోపదేశముచేసి నీతిపద్యములచే మేమువెళ్లినపనిని మామనస్సులోనే యుంచి కొని సిగ్గుపడి మరలునట్లుచేయుదురు.

భుక్త—(పటపటపండ్లుకొఱికి)వారివధాచారము చట్టుముట్టినట్లైయున్నది. మీరు పట్టి యప్రయోజకులు. హైమవతికన్న సుందరియైనయాఁడుదియున్నదా ? దానిని చూచి యందఱు ఆఁడువారు మూతులు ముక్కులు విఱుచుచునే యున్నారు. మీ కెఱుఁగరాదేమి? కాశిలో దానిభర్తతో నేనుమాటాడినాను. దీనిదుష్ప్రవర్తనమునండియె వాఁడు ఇల్లువాకిలి వదలి పరదేశమునకుఁబోయి సన్యసించినాఁడు. చూడు, దాని కూఁడని తెగువ! సన్యాసిభార్య సగము విధవకదా ? లొణకక బెణకక తాను కూఁతు తోఁగూడ సానిదానివలె శృంగారించుకొనును. దీనినుండియె రత్నమువంటికూఁతునకుఁ బెండిలియైనదికాదు చివరకు మూఁడునెలలయినది యీపిల్లరజస్వలయై. ఇఁక దాని యింట పుడిసెడు మంచినీళ్లు పుచ్చుకొనుటకైన వర్తిలేదుకదా ? ఇఁక దానికెందుకు అంతపట్టుదల ? నామాటవినకూడదా ? వ్రతముచెడినను సుఖముదక్కునే.

ఆనంద—అన్నయ్యగారు! నేనొకమనవి చేయుచున్నాను. నామీఁద కోప పడరుకదా?

కాంభుక్త—ఏమిరా వెఱ్ఱిపాడిగట్ట! అదియేమిమహాయోగ్యురాలనుకున్నావా! కులముచెడినను నావల్లనైన సదుపాయము చేయుదమనుకొన్నాము. దానికి ప్రాప్తి పట్టలేదు.

ఆనంద—నామాట కడ్డుపచ్చెదరేమి? అన్నయ్యగారు!

కాంభుక్త—ఏదోచెప్పురా. నాదగ్గరనంత నిర్భయముగా మాటాడువాఁడవు నీవొక్కఁడవే కనపడుచున్నావు.

ఆనం—నాతల మీరు తీయించివైచినను ఉన్నమాట ఉన్నట్లు చెప్పుట నా స్వభావము.

కాం—అవును, నేనెఱుఁగుదును.

ఆనంద—హైమవతియందు దోషము లేశమయినను న్నదా? మీకార్పణ్యమెట్టిది యోకాని దానిని వేఁచి వైచుచున్నారు. శీలమును గాపాడుకొనుటయందు దాని పరాకాష్ఠ యెట్టిదియోకాని యెన్నికష్టములచేత నయినను దానిధైర్యము చలించలేదు. పరమార్థముచేత నాలోచించి చూడఁగా మీరు ప్రతిదినమును నెక్కుచుదిగుచునుండిన గడపలు పరిశుద్ధములయినవా? మీపాదవిన్యాసమును నిషేధించిన హైమవతి యిల్లు అపవిత్రమయినదా? చాలుచాలు, మీరు గ్రామాధికారము నవలంబించినది మొదలు పొన్నాడ సుందరీజనమూరకె నాలుగుగోడల నడుమనున్నదికాని యోగ్యత యెంత వెతకినను సున్న. అజట్టులోఁ జేరక నూఱుకాకులలో నొక కోవెలవలె కాలము గడుపుచున్న హైమవతి మీబుద్ధికెట్లు యోగ్యురాలగును? (ఇంచుకనవ్వి) ఓహో!

ధర్మము నాలుగుపాదములను నడిపించుచున్నారు! నామాటలవలన ప్రయోజనమేమి? గ్రామములో మీరెక్కుడిగని గడపలేదు. మీయన్నము తిననివారు లేరు. మీమాటాడనివారు లేరు. మీరెవరివిషయమేమి సంకల్పించుకొనినను చెల్లకపోదు. మనయూరు క్రమముగా కొల్లేరగుచున్నది.

శాంభుక్త—ఆనందుగా! నీకావరమెప్పటికి నొక్కలాగుననే యున్నది! కొమ్ములుదిరిగినవారు నాయెదుట మాటాడలేరు. ఏమిరానీకింత సాహసము?

ఆనం—మాటలెకాని మీకార్యములయందు నేనెప్పుడయిన నడ్డుతగిలినానా? చేతులుగట్టుకొని నడుచుచున్నాను.

శాంభు—విస్సా! దీనితోనేమి? పేడు పట్టి వెటకారపువాడు. నీవునిజము చెప్పు. మీవల్ల నీకార్యమగునా కాదా? కాకుంటే మఱియెవరివల్లను కాదు.

ఆనం—అన్నయ్యగారు! ఏమిమనవిచేయుదును? వారు నిన్నరాతిరిపూట నెక్కడకో దారిపట్టినారు. మనమిక బలవంతము చేయుదుమేమో యని భయపడినారు.

శాం—ఈమట్టుపట్టుల నెక్కడనున్నను నేచెఱువునీరు త్రాగగలరు?

ఆనం—అన్నయ్యగారు! ఇకపోనిండు; మన గ్రామమువిడిచి పోనేపోయినారు. వారివిధి యేలాగున నుండిన నట్లగును. మనము శోక్యము పుచ్చుకోవద్దు.

శాంభు—అలాగుననే కానిండు. వారియూను మనకేమి? ఎల్లప్పుడును మనకిదే హరిస్మరణమైనది. ఫాల్గుణశుద్ధఏకాదశి సమీపించుచున్నది. శ్రీకూర్మయాత్ర చేయుదమా?

ఆనం—తప్పకుండ—

శాం—విస్సా! రాత్రిఅల్లాచింతావాడువచ్చినాడు. ఉన్నాడాపోయినాడా?

విశ్వే—ఏచింతావాడు?

శాంభు—మన యూరివాడె. శ్రీకూర్మపు పాఠశాలలో చదవుకొనుచున్నాడు. ఎఱుగవటరా? అదిక్కుమాలిన ముండకొడుకు!

ఆనం—వానికి శ్రీకూర్మపు పాఠశాలలో చదువయినది. కాశీయాత్ర దలచుకొన్నాడు. నలుగురిని యాచించి నాలుగుడబ్బులసొమ్ము పట్టుకొని రాత్రి శ్రీకూర్మమునకే పోయినాడు.

శాంభు—వాడు క్రిందటిమాఱు వచ్చినప్పుడు హైమవతియింట మంచినీళ్ళు త్రాగినాడట. ఆభ్రష్టుముండచేత నన్నముగూడ తినియుండును. వచ్చినప్పుడెల్ల వారియిల్లు వదలడు. నిన్నరాత్రి వచ్చినప్పు డేమోతెగనీల్గినాడట. వానినిగూర్చి మనము కొంచెము జాగ్రతపుచ్చుకోవలెను.

హిందూదేశ పూర్వచరిత్రసంగ్రహము.

౧. ప్రకరణము.— వైదికకాలము.

ఆదికాలమునుండియు మనపూర్వులు నిజమైనచరిత్రమును వ్రాయుట కలవాటుపడినవారుకారు. అందుచేత మనదేశముయొక్క చరిత్రమును యథాక్రమముగా వ్రాయుట సాధ్యముకాదు. అయినను మనపూర్వులు రచియించిన వేదాదిగ్రంథములవలన మనపూర్వులయొక్క యాచారవ్యవహారములను సాంఘికస్థితిని మతరీతిని గొంతవఱకుఁ దెలిసికొనవచ్చును. మనగ్రంథములలో నెల్ల ప్రాచీనములయినవి వేదములు. వేదములన్నిటిలోను ఋగ్వేదము మిక్కిలి పురాతనమైనది. ఒక్క మనదేశమునందుఁగల గ్రంథములలో నేగాక లోకములోఁగల గ్రంథములలో నేదియు ఋగ్వేదమంత పురాతనమయినదిగాని యంతకంటెఁ బ్రాచీనమయినదిగాని లేదు. మన పూర్వులయొక్క స్థితిగతులను దెలుపుటలో ఋగ్వేదము పరమప్రయోజనకరమయినదిగా నున్నది. వేదఋక్కులు రచియింపఁబడినకాల మేదియో నిశ్చయముగాఁ దెలియకపోయినను, ఋక్కులు నాలుగువేలసంవత్సరములక్రిందట నారంభింపఁబడితరువాత నాలునూఱుసంవత్సరములవఱకును జేయఁబడుచువచ్చినవని యిప్పటి పశ్చిమఖండపండితు లనేకులూహించుచున్నారు. ఋగ్వేదమంత్రములను రచియించినమనపూర్వులు ఋషులనఁబడుచుండిరి. వేదములు మనుష్యులచేతఁ జేయఁబడినవికావనియు, అవి నిత్యములయి యనాదిగా నున్నవనియు, మనపెద్దలు కొంతకాలమునుండి చెప్పుచువచ్చుచున్నను వేదకర్తలయిన ఋషులే ఋక్కులను దాము రచియించితిమనియు నందుఁగొన్ని పురాతనములును గొన్ని నూతనములునినియుఁ జెప్పియుండుటచేత నిప్పటి మనవారి వాదము విశ్వాసార్హమయినదికాదు. ఇందలిసత్యము తేటపడుటకయి ఋగ్వేద సంహితలోని రెండు ఋక్కులనుమాత్ర మిందుదాహరించుచున్నాను—

„ఏతాని వా మశ్వినా వర్ధనాని బ్రహ్మస్తోమం గృత్సమదాసో అక్రన్."

౨ మం. ౩౯ సూ. ౮ ఋక్.

(ఓఅశ్వినులారా! దీనిని ఈమహాస్తోత్రములను గృత్సమదనుఁడు మీకొఱకుఁ జేసియున్నాఁడు.)

"సనాయతే గోతమ ఇంద్ర నవ్య మతక్షద్బ్రహ్మ హరియోజనాయ &c."

౧ మం. ౬౨ సూ. ౧౩ ఋక్.

(ఓయింద్రుఁడా! ఈక్రొత్తమంత్రమును నీకొఱకు గోతమగోత్రుఁడు చేసెను&c)

ఇత్యాది ఋగ్వేదవాక్యము లనేకములు ఋషులేమంత్రకర్తలనియు, ఋగ్వేద మంత్రములు పూర్వపువికొన్నియు తరువాతివికొన్నియు నున్నవనియు, ఘోషించు చున్నవి. ఋగ్వేదములోని ప్రథమమండలమున ౧౯౧ సూక్తములుగలవు; వానికి గోతమ కణ్వ కుత్సాదులను పదునైదుగురుఋషులను కర్తలనుగాఁ జెప్పుదురు. రెండవ మండలమున ౪౩ సూక్తములుగలవు; వానికిఁగర్త గృత్సమదుఁడందురు. మూడవమండ లమున ౬౨ సూక్తములుగలవు; వానికిఁగర్త విశ్వామిత్రుఁడందురు. నాలవమండలమున ౫౮ సూక్తములుగలవు; వానికిఁగర్త వామదేవుఁడందురు. అయిదవమండలమున ౮౭ సూక్తములుగలవు; వానికిఁగర్త అత్రియందురు. ఆఱవమండలమున ౭౫ సూక్తములు గలవు; వానికిఁగర్త భరద్వాజుఁడందురు; ఏడవమండలమున ౧౦౪ సూక్తములుగలవు; వానికిఁగర్త వశిష్ఠుఁడందురు. ఎనిమిదవమండలమున ౯౨ సూక్తములుగలవు; వానికిఁ గర్త కణ్వుఁడందురు. తొమ్మిదవమండలమున౧౧౪సూక్తములుగలవు; వానికిఁగర్త అంగి రసుఁడందురు. పదవమండలమున ౧౯౧ సూక్తములుగలవు; పయిదొమ్మిది మండల ములకువలె నొకఋషిగాక యెందటిమండలమువలెనే దీనికిని కర్త లనేకులని చెప్పుదురు. ఈకడపటి మండలములోని సూక్తములు తక్కినవానికంటె నూతనములైనవని చెప్పు చున్నారు. ప్రసిద్ధమైన పురుషసూక్త మీమండలములోనిదే.

మనపురాణములలో వర్ణింపఁబడిన టరణ్యములలో వసించువారుగాక మంత్ర కర్తలయిన ఋషులు మనవలెనే పట్టణములలో వాసముచేయుచు భార్యాపుత్రాదు లతో సంసారముచేయు గృహస్థులుగానుండిరి. ఈఋక్కులుచేయఁబడిన కాలమునందు మనపూర్వులు క్రొత్తగావచ్చి యిప్పుడు పంజాబనఁబడెడి సింధునదీప్రాంతదేశమునందుఁ జేరియుండిరి. వీ రాసియాఖండముయొక్క మధ్యభాగమునుండివచ్చి తమకుఁ బూర్వ మందక్కడనుండినయనాగరికులయినజనులతో యుద్ధముచేసి జయించి వారినరణ్యములకుఁ దాఱఁద్రోలి వారిదేశమును క్రొత్తగా నాక్రమించుకొనిరి. ఇట్లీభరతఖండమునకు దం డెత్తివచ్చి సింధునదీతీరప్రదేశములను మొదట నాక్రమించుకొన్న మనపూర్వు లార్యు లనఁబడెడివారు. ఆర్యశబ్దమునకు కృషీవలుఁడని యర్థమనియు, ఆర్యులు కృషియే ముఖ్యవృత్తిగాఁ గలవారగుటచేత వారికాపేరు వచ్చినదనియు, కొందఱు విద్వాంసులు చెప్పుచున్నారు. వ్యవసాయము చేయువారగుటచేత వారికాపేరు వచ్చినను రాకపోయి నను, వారప్పటికే యితరులకంటె నెక్కువనాగరికత కలవారయి కృష్యాదికర్మలు

చేయ నేర్చినవారయి విశేషముగా సేద్యము చేయుచువచ్చిన వారగుటకు సందేహము లేదు. కృషికర్మనుగూర్చి ఋగ్వేదమునందుఁ జెప్పఁబడినవానిలోఁ గొన్ని ఋక్కుల నిం దుదాహరించుచున్నాము.—

౧. క్షేత్రస్య పతినా వయం హితేనేవ జయామసి
గామశ్వం పోషయిత్న్వా స నో మృళాతీదృశే.

౨. క్షేత్రస్య పతే మధుమంత మూర్మిం ధేనురివ పయో అస్మాసు ధుక్ష్వ
మధుశ్చుతం ఘృతమివ సుపూతమృతస్య నః పతయో మృళయంతు.

3. మధుమతీ రోషధీర్ద్యావ ఆపో మధుమన్నో భవత్వంతరిక్షం
క్షేత్రస్యపతి ర్మధుమాన్నో అస్త్వరిష్యంతో అన్వేనం చరేమ.

౪. శునం వాహాః శునం నరః శునం కృషతు లాంగలం
శునం వరత్రా బధ్యంతాం శునమష్ట్రాముదింగాయ.

౫. శునాసీరావిమాం వాచం జుషేథాం యద్దివి చక్రథుః పయః
తేనేమాముపసించతం.

౬. అర్వాచీ సుభగే భవ సీతే వందామహే త్వా
యథా నః సుభగాససి యథా నః సుఫలాససి.

౭. ఇంద్రః సీతాం నిగృహ్ణాతు తాం పూషానుయచ్ఛతు
సానః పయస్వతీ దుహాముత్తరా ముత్తరాం సమాం.

౮. శునం నః ఫాలావికృషంతు భూమిం శునం కీనాశా అభియంతు వాహైః
శునం పర్జన్యో మధునా పయోభిః శునాసీరా శునమస్మాసు ధత్తం.

౪ మండలము, ౫౭వ సూక్తము.

౧. క్షేత్రపతితో మేమీపొలమును జయింతుము (సేద్యముచేయుదుము); అతఁడు మాగోవులను గుఱ్ఱములను పోషించునుగాక! ఈవిధముగా మమ్మతఁడు సుఖింపఁ జేయునుగాక!

౨. ఓ క్షేత్రపతీ! పాలను ధేనువువలె మధురమైన జలమును మాకు కురిపింపుము. ఘృతమువలె రుచ్యమైన పవిత్రోదకమును మాకిమ్ము. ఉదకస్వాములు మాకు సుఖమిత్తురుగాక!

3. ఓషధులు మాకు మధురములగునుగాక! దివియు జలమును అంతరిక్షమును మాకు మధురములగునుగాక! క్షేత్రపతి మాకనుకూలుఁడగునుగాక! శత్రుబాధలేక మేమాతని ననుచరించెదము.

౪. వాహనములు సుఖముగా పనిచేయునుగాక! నరులు (కర్షకులు) సుఖముగా పని చేయుదురుగాక! నాగలి సుఖముగా జరుగునుగాక! మోకులు సుఖముగాఁ గట్టఁబడునుగాక! ప్రతోదము సుఖముగా నడుపునుగాక!

౫. ఓశునా! ఓసీరా! ఈ నా స్తుతము నంగీకరింపుఁడు. మీ రాకాశమునందు సృజించిన యుదకముతో భూమిని తడుపుఁడు.

౬. ఓసుభగురాలైన నాగంటిచాలా! నీకు వందనము చేయుచున్నాము. ముందుకు సాగుము. మాకు ధనమిమ్ము; మాకు ఫలము (పంట) నిమ్ము.

౭. ఇంద్రుఁడీనాగటిచాలును (సీతను) గ్రహించునుగాక! పూషుఁడామెను ముందుకు సాగించునుగాక! నాగటిచాళ్లు నీళ్ళతో నిండి మాకు ముందు సంవత్సర సంవత్సరమును పంటలిచ్చునుగాక!

౮. నాగలి భూమిని సుఖముగా పెల్లగించునుగాక! మనుష్యులు సుఖముగా వాహములను వెంబడింతురుగాక! మధురమైనజలముతో పర్జన్యుఁడు భూమిని తడుపునుగాక! శునాసీరులుఁ మమ్ము సుఖింపఁ జేయుదురుగాక!

ఇందుఁ జెప్పఁబడిన క్షేత్రపతి సస్యాధిష్ఠానదేవత. కృషికర్మనుగూర్చి చెప్పఁబడినవానిలో నింకొక్క సూక్తభాగమునుగూడ భాషాంతరసహితముగా నిందుదాహరించుచున్నను—

౩. యునక్త సీరా వియుగా తనుధ్వం కృతే యోనౌ వపతేహ బీజం.
గిరాచశ్రుష్టిః సభరా అసన్నో నేదీయ ఇత్సృణ్యః పక్వమేయాత్.

౪. సీరా యుంజంతి కవయో యుగా వితన్వతే పృథక్
ధీరా దేవేషు సుమ్నయా.

౫. నిరాహావాన్కృణోతన సంవరత్రా దధాతన
సించామహా అవత ముద్రిణం వయం సుషేక మనుపక్షితమ్.

౬. ఇష్కృతాహావ మవతం సువరత్రం సుషేచనం.
ఉద్రిణం సించే అక్షితం.

౭. ప్రీణీతాశ్వా న్హితం జయాథ స్వస్తివాహం రథమిత్కృణుధ్వం.
ద్రోణాహావ మవత మశ్మచక్ర మంసత్రకోశం సంచతా నృపాణం.

౧౦ మండలము, ౧౦౧ సూక్తము.

౩. నాగళ్ళుకట్టుము; కాఁడులను విస్తరింపఁజేయుము; నాగటిచాళ్ళలో బీజములు చల్లుము. మనవాక్కులతో ధాన్యము భారవంతమగునుగాక! పక్వమయిన చేరువ పొలమునకు కొడవండ్లభిముఖ మగునుగాక!

౪. నాగళ్ళు కట్టఁబడినవి; మనుష్యులు కాఁడులుసాగించినారు; పండితులు దేవతలను స్తుతించుచున్నారు.

౫. పశువుల పానమునకు తొట్లు సమకూర్పుఁడు. తోలు పగ్గములుకట్టి, మంచి యూట గలట్టియు నెప్పుడు తఱుఁగనట్టియు జలముగల లోఁతుబావినుండి నీళ్ళెత్తుదము.

౬. తొట్లు సమకూర్పఁబడినవి; మంచిపగ్గములు గలట్టియు మంచియుదకసేచనముతోఁ గూడినట్టియు క్షీణముగాని యూటగలట్టియు బావినుండి నీళ్లుతోడుము.

౭. అశ్వములను తృప్తిపఱుపుము. మేలుపంట పోగుచేయుము; దానిని సుఖముగా వహించుటకు రథముసమకూర్పుము. బావియే పెద్దనీళ్ళతొట్టిగానున్నది. దానికి రాతిచక్రమున్నది. మనుష్యుల పానార్థ మంసత్రకోశమును నీళ్లతో నింపుము.

పయి ఋక్కులనుబట్టి యాకాలమునందు పొలములకు బావులలోనుండి నీరు పారించుచుండినట్లు స్పష్టపడుచున్నది. పొలములకు నీరు పెట్టుటకు మాత్రమేకాక మనుష్యులయొక్కయు జంతువులయొక్కయు పానముకొఱకయి యుపయోగించు బావులును వేఱుగనుండినట్లు తెలియవచ్చుచున్నది. ఇప్పటివలెనే యాకాలమునందును బావులలోని నీరు మోటగూనలతోను ఘటీయంత్రములతోను పయికి తోడఁబడుచుండెను. అయినను కృషికర్మలో మనదేశమం దిప్పుడు లేనివిశేషమొక్కటి యాకాలమునందుఁ గానఁబడుచున్నది. మనవలె మనపూర్వులప్పుడు తమనాగళ్ళలాగుట కెద్దులనుపయోగింపక వానికి గుఱ్ఱములనుకట్టి తమపొలములను గుఱ్ఱములతోడ్పాటుతోనే దున్నుచుండెడివారు. ఈయాచారమిప్పు డీభరతఖండమునందు లేకపోయినను యూరపుఖండమునం దంతటను వ్యాపించియున్నది.

ఆకాలమునందలి ఋషులు కృషికర్మయందు నిపుణులుగానుండినను, పశువుల మందలను బెట్టుకొనియుండినను, స్వర్ణరజతాది లోహముల ప్రయోజనము నెఱిఁగినవారయి యుండినను, వాణిజ్య వ్యాపారమును జరపుచుండినట్లు కానరాదు. వారప్పుడు యవాది ధాన్యములను పండించి యాహారార్థముగా నుపయోగించుకొనుచుండుటయేకాక పిండివంటలను జేయుటకును నేర్చినవారయి యుండిరి. అపూపములు మొదలైన యనేకభక్ష్యముల నామములు ఋగ్వేదమునఁ గానఁబడుచున్నవి. అప్పుడు వారుయథేచ్ఛముగా మాంసాహారమును సహిత మనుభవించుచుండిరి. ఆకాలమునందలిఋషు లితరమాంసములను మాత్రమేకాక యీకాలమునందు నిషేధింపఁబడియున్న గోమాంసమును సహితము తమదేవతల కర్పించి తాము భక్షించుచుండిరి.

"అఘాసు హన్యంతే గావోఽర్జున్యోః పర్యుహ్యతే"

౧౦ మం. ౮౫ సూ. ౧౩ ఋక్కు.

(మఘలయందు గోవులుచంపఁబడును; ఫల్గునులందుఁ బెండ్లిచేయుదురు.)
ఈఋక్కునుబట్టి పెండ్లికూఁతును భర్తయింటికిఁ బంపుటకుఁ బూర్వమునందు గోవును జంపుట యాకాలమునం దాచారమయినట్లు కనఁబడుచున్నది.

"పచంతి తే వృషభాం అత్సి తేషాం పృక్షేణ యన్మఘవాన్ హూయమానః"

౧ మం. ౬౬ సూ. ౧౩ ఋక్కు.

(నీకొఱకు వృషభములను పచనముచేయుచున్నారు. ఇంద్రుఁడా! ఆహ్వానము చేయఁబడినవాఁడవై యందలి మాంసమును భక్షింతువు.)

ఈఋక్కునందు వృషభముల నింద్రునికొఱకు చంపఁబడునట్లు చెప్పఁబడినది. ఇటువంటి వాక్యముల నింకను జెక్కింటిని జూపవచ్చునుగాని యట్లు చూపుట యిచ్చట నావశ్యకముకాదు.

"మిత్రక్రువో యచ్ఛసనే న గావః పృథివ్యా అపృగ ముయాశయన్తే."

౧౦ మం. ౭౯. సూ. ౧౪ ఋక్.

(శసన స్థానమునందు గోవులవలె నాక్రూరకర్ము లక్కడభూమిమీఁద పడియున్నారు.) యుద్ధమునం దసంఖ్యముగాఁ జంపఁబడి భూమిమీఁదఁబడియున్న శత్రువులను పశువిశసనస్థానమునందుఁ బడియుండు గోవులవలె నున్నట్లు చెప్పుటచేత నాకాలమునం దాహారమునిమిత్తము గోవులనుజంపెడుస్థలములు ప్రత్యేకముగా నుండినట్లుస్పష్ట మగుచున్నది. అప్పటిఋషులు మహిషములు గొఱ్ఱెలు మొదలయిన జంతువులను భక్షించువారయినట్లు తెలిపెడువాక్యము లనేకములు ఋగ్వేదమునం దున్నవి. ఈమాంసభక్షణాచారము వీరికి సింధునదీతీరప్రదేశమునందు నూతనముగా వచ్చినది గాక యీదేశమునకు రాక పూర్వమునుండియు నుండియుండినదే. ఈఋషులాదియం దీదేశపువారుకారనియు, ఆసియాఖండముయొక్క మధ్యప్రదేశమునుండి వచ్చినవారనియు, ఈవఱకే తెలుపఁబడెనుగదా! వీ రీప్రదేశమునుండి వచ్చినారని నిశ్చయముగాఁ దెలియక పోయినను, వీరికి పూర్వస్థానమొకటి యుండెననియు, అది యీదేశమునకంటె శీతలమయినదనియు, వారు పడమటనుండి తూర్పుముఖముగా ప్రయాణముచేసి యిచ్చటకు వచ్చినారనియు, సూచించెడువాక్యములు ఋగ్వేదమునందే కానవచ్చుచున్నవి.

"అను ప్రత్నస్యౌకసో హువే తు విప్రతిం నరం
యం తే పూర్వం పితా హువే"—మం. ౧., సూ. ౩౦., ఋక్ ౯.

ఈఋక్కునందు 'పూర్వము నిర్మాహణాయము చేసిన మా పురాతనస్థల (ప్రత్న స్యౌకస్) పితరుఁడు' అని పూర్వవాసస్థల మొకటి యున్నట్లు చెప్పఁబడినది.

"పుష్యేమ తనయం శతం హిమాః"—మం ౧., సూ ౬౪., ఋక్ ౧౪.

(కొడుకులను మేము నూఱు హిమములు వృద్ధిపొందుదుముగాక!)

ఇత్యాది బహుఋక్కులయందు నూఱుసంవత్సరము లనుటకుమాఱుగా నూఱుహిమములని చెప్పఁబడియుండుటచేత వారు పూర్వము చలిదేశమునుండి వచ్చినవారని యూహింపఁదగియున్నది. వీరిపూర్వులంతగా నాగరికత లేనివారయి వేటాడినజంతువులనుతిని జీవించెడి వనవాసులయి యుండవచ్చును.

"ఉక్షాణం పృశ్నిమపచంత వీరా స్తాని ధర్మాణి ప్రథమాన్యాసన్"

మం ౧. సూ ౧౬౪. ఋక్కు ౧౪.

(వీరులైనవారు పొడలయెద్దును పచనముచేసిరి. ఇవియాదిమధర్మములు.)

ఋగ్వేదములోని యిటువంటి వాక్యములుకొన్ని తత్పూర్వులస్థితిని సూచించుచున్నవి.

ఎంత యనాగరికులయినను పరులు క్రొత్తగా తమదేశము నాక్రమించుకొనవచ్చినప్పుడు వారితోపోరాడక దేశమును చులకగా వదలిపెట్టరు. కాఁబట్టి యార్యులీదేశమునకు మొదటమొదటవచ్చినప్పు డిచ్చటిప్రాఁతకాపులతో చిరకాలము యుద్ధముచేసిరే క్రమక్రమముగా ఫలవంతములయిన సింధునదీతీర ప్రదేశముల నాక్రమించి కైకొనవలసినవారయిరి. ఆర్యులకుఁ బూర్వమునం దీదేశమునందు వసించుచుండినవా రిప్పటి భిల్లులు మొదలైనయాటవికుల పూర్వులేయయియుండవచ్చినను, అంతయనాగరకులుగారు. వారు పట్టణములును కోటలును కట్టుకొని యందు వాసముచేసెడివారే.

"సజాతూభర్మా శ్రద్ధధాన ఓజః పురోవిభింద న్నచరద్వి దాసీః"

౧ మం. ౧౦౩ సూ. ౩ ఋక్కు.

(అతఁడాయుధముతో తనబలమునమ్మి దానుల పురములను నాశముఁజేయుచు సంచరించెను.)

ఇటువంటికార్యములవలన నిచ్చటి ప్రాఁతకాపులు మనపూర్వులు దండెత్తివచ్చునప్పటికి పురములను గలవారయినట్లు తేటపడుచున్నది. ఈవాక్యమునందుఁ జేర్కొనఁబడినరీతిని మనయార్యులు వారిని గొన్నిచోట్ల దాసులనిపిలుచుచు వచ్చినను సాధారణముగా వారిని దస్యులనివాడుచుండిరి. దస్యులనుపదమునకు శత్రువులనియర్థము. దానినలని యర్థమిచ్చెడి యీదాసపదము తిరస్కారమును జూపుటకయి యుపయోగింపఁబడియుండును. ఇట్లే వారి నక్కడక్కడ రాక్షసులనియు, పిశాచములనియు, వ్యవహ

రించుటకూడఁగలదు. జయశాలులకు జయింపఁబడినవారియెడల తిరస్కారభావముం డుట యెందునుసహజమే. జితులొకపట్టున లోఁబడక యెదిరించి చేతనైనంతహానిని జేయుచువచ్చినప్పుడు జేతలకు వారియెడల ద్వేషముసహితము పుట్టును. అట్టివో మతాంతరులుకూడనయినయెడల నట్టిద్వేషమునకు పరిమితియుండదు. దస్యులు లింగో పాసకులు.

„స శర్ధ దర్యో విషుణస్యజంతోర్మా శిశ్నదేవా అపిగు ఋతం నః"

౭ మం. ౨౧ సూ. ౫ ఋక్.

ఈఋక్కునందు 'శిశ్న(లింగ)దేవా' రాధకులు తమయుపాసనను చేరకుందురు గాకయని చెప్పఁబడినది.

౨. „అభి వ్లగ్యా చిదద్రి వః శీర్షాయాతుమతీనాం
ఛింధివటూరిణా పదా మహావటూరిణాపదా."

౩. „అవాసాం మఘువజ్జహి శర్ధో యాతుమతీనాం
వైలస్థానకే అర్మకే మహావైలస్థే అర్మకే."

౪. „యాసాం తిస్రః పంచాశతోభిప్లంగై రపావపః
తత్సు తేమనాయతి తకత్సు తేమనాయతి."

౫. „పిశంగభృష్టి మంభృణం పిశాచి మింద్ర సంమృణ
సర్వం రక్షో నిబర్హయ."

౧ మం. ౧౩౩ సూక్తము.

౨. రాయివిసరి క్రూరశత్రువులయొక్క శీర్షములను పగులఁగొట్టువాఁడా!
నీపాదముతో—నీపెద్దపాదముతో—వానిని నలగఁద్రొక్కుము.

౩. ఓమఘువానుఁడా! ఈక్రూరశత్రువులయొక్క బలమును నాశముచేసి వారిని
సన్నగోతిలో త్రోయుము—సన్నలోతుగోతిలో త్రోయుము.

౪. ఓయింద్రా! ఇటువంటిగుంపులను నూటయేఁబదింటిని శౌర్యముతో నీవునాశము
చేసినావు. జనులునిన్ను స్తుతించుచున్నారు. ఆస్తుతి నీప్రతాపమునకుచాలదు.

౫. ఓయింద్రా! పిశంగవర్ణములు గలిగి భయంకరముగా నఱచెడి యీపిశాచ
ములను చంపుము. ఈరాక్షసుల నందఱిని సంహరింపుము.

మన యార్యులకు దస్యులయం దెంతద్వేషముండెనో పయివాక్యములే చెప్పక చెప్పుచున్నవి. దస్యులవిషయమయి మనపూర్వులు తమ దేవతలను ప్రార్థించిన ప్రార్థనలలో మఱిరెండువాక్యములను మాత్రమీప్రస్తావమునఁ బొందుపఱచుచున్నాము—

ప్రకటన.

ఇప్పుడు సంపుటములుగా ముద్రింపఁబడుచున్న [illegible] కందుకూరి వీరేశలింగము పంతులుగారి పుస్తకములలో మొదటి సంపుటము విక్రయమునకు సిద్ధముగానున్నది. దళసరియైన కాగితములమీఁద ముద్రింపఁబడి, గిల్టక్షరములు వేసి కాలికోగుడ్డతో బైండుచేయఁబడిన ప్రతి వెల [illegible] కూలిగాక రు. 3-0-0 లు; కాలికోగుడ్డతో బైండుచేయఁబడిన [illegible] కాగితములప్రతి వెల రు. 2-8-0 లు. ఈసంపుటము 5[illegible] పుటలుగలది. ఇందు, అపూర్వబ్రహ్మచర్య ప్రహసనము, విచిత్రవివాహ ప్రహసనము, మహాబధిర ప్రహసనము, పునర్మరణప్రహసనము, బలాత్కార[illegible] ప్రహసనము, కలహప్రియా ప్రహసనము, మహామ[illegible] ప్రహసనము, యోగనిద్రా ప్రహసనము, మహావంచ[illegible] ప్రహసనము, అసహాయశూర ప్రహసనము, కలిపురుషశనైశ్చర విలాసము, [illegible] ప్రహసనము, కౌతుకవర్ధని, వినోదతరంగిణి, హాస్యస[illegible] ప్రథమ ద్వితీయ తృతీయభాగములు, చేరియున్నవి.

IMPORTANT NOTICE.

విజ్ఞాపనము.

ఆంధ్రభాషాభిమానులగు సుహృదులారా!

నాపుస్తకముల నన్నిటిని క్రొత్తయక్షరములతో [illegible] ములమీఁద సంపుటములుగా నచ్చువేయించుచున్నాను. [illegible]

హించుట విశేషధనసాధ్యమన్న యంశ మెల్లవారికిని విశదమయియున్నది. ఇప్పుడున్న ప్రకారముగా నా పుస్తకము లన్నిటియొక్కయు వెలలు దాదాపుగా ముప్పది రూపాయలవఱకు నగునని యీపుస్తకముల పట్టికను జూచువారికెల్లరకు స్పష్టమగును. ఇప్పుడొక్కసారిగా నిరువదిరూపాయలనుదయచేయువారికి మంచిదళసైననునుపు కాగితములమీఁద నచ్చు వేయఁబడి, గిల్టక్షరములు వేసి కాలికోగుడ్డతో పూర్ణముగా బైండుచేయఁబడిన సంపుటములన్నియు నియ్యఁబడును. ఈసంపుటములలో నిప్పుడున్న పుస్తకములు మాత్రమేకాక యీపనిముగియులోపలఁ జేయఁబడునూతన పుస్తకములును జేరియుండును. పూర్తిగాముద్రింపఁబడినతరువాత నీసంపుటముల వెల ముప్పదిరూపాయలుండును. ఈదళసైనకాగితములతో వేయఁబడు ప్రతులుగాక పలుచని కాగితములతో సహితము వేఱుగా సంపుటములు వేయఁబడుచున్నవి. ఇప్పుడొక్కసారిగా పదునేనురూపాయల నిచ్చువారికి పలుచని కాగితములమీఁద ముద్రింపఁబడి కాలికోగుడ్డతో బైండుచేయఁబడిన యీసంపుటములన్నియు నియ్యఁబడును. పూర్ణముగా ముద్రింపఁబడినతరువాత నీసంపుటముల వెల యిరువదిరూపాయలుండును. టపాకర్చులను పుస్తకములనుగొనువారే భరింపవలయును. ఈప్రకారముగా ముందుగా సొమ్మిచ్చు భాషాభిమానులు తాము లాభమును బొందుటయేకాక నాకును సహాయముచేసిన వారగుదురు. కాఁబట్టి దేశభాషాభిమానసమాననీయులగు మహనీయులందఱును నాకీవిధముగా తోడ్పడుదురని వారిని వినయపూర్వకముగాఁ బ్రార్థించుచున్నాను. ఇప్పుడువిడివిడిగానున్న పుస్తకముల నన్నిటినొక్కసారిగా మొత్తముగాఁగొనువారి కంచెకూలిగాక పదునేనురూపాయలకే యన్ని పుస్తకములు నియ్యఁబడును. నాచేరచియింపఁబడినవిగాక నాచేముద్రింపఁబడి యీపట్టికలోఁ జేరియున్న యితరపుస్తకములనుగూడ నపేక్షించువారిరువదిరూపాయలను బంపవలెను. పయిని వివరింపఁబడిన తక్కువ వెలలకు పుస్తకము లీసంవత్సరము ఆగస్టునెల

ముగియులోపల సొమ్ము పంపువారికిమాత్రమే యియ్యఁబడును. ఈవఱకే జూన్ నెల కడపటివఱకుమాత్రమే సంపుటములను తక్కువ వెలలకిచ్చుట కేర్పాటుచేయఁబడినను, కొందఱుమిత్రుల కోరికప్రకారముగా ఆగష్టునెల కడవఱకును కాలము పెంపుచేయఁబడినది. అప్పటికించుమించుగా నేనూఱేసిపుటలు గల మూఁడు వాల్యూములు సిద్ధమగును. ఇప్పుడు మొదటి సంపుటము విక్రయమునకు సిద్ధముగానున్నది. ఒక్కొక్క వాల్యూము సిద్ధముకాఁగానే చందాదారుల కెప్పటికప్పుడావాల్యూము పంపఁబడుచుండును. సొమ్మంతయు నొక్కసారిగాపంపుటకనుకూలపడనివారు ఆగష్టునెల యంతమగులోపల రెండుసారులైనను బంపవచ్చును. ఇష్టమున్నవారు ముందుగాఁ దెలిపినచో మొదటి వాల్యూమును (V. P. P.) వాల్యూపేయేబిలుగాఁ బంపి సొమ్మువసూలు చేయఁబడును. ఇందలిపుస్తకములలో పెద్దవానినొకటి రెంటిమూఁటిని గాని, చిన్నపుస్తకములను పెక్కింటిని గాని, చేర్చి కాలికోగుడ్డతో బైండుచేయించి పంపఁగోరెడుపక్షమున నాలుగణాలధికముగాఁ బంపవలయును.

పుస్తకములనుగోరువారు చెన్నపట్టణము, పరశువాకము, ఆదియప్పమొదలివీధి ౪ నెం. గృహమునస్థాపింపఁబడియున్న శ్రీచింతామణి ముద్రాక్షరశాల మేనేజరుగారికి వ్రాసి పుస్తకములను దెప్పించుకొనవలెను.

రు. ౦-౫-౦ లు లోపు వెలగల పుస్తకములు కోరువారు వీ. పీ. గాఁగోరక టపాబిళ్లలనుబంపుట మంచిది.

౧౩, వెల్లాళవీధి,
పరశువాకము, చెన్నపురి.
౮ జూలై ౧౮౯౮ వ సం.

ఇట్లు
విన్నవించువిధేయుఁడు,
కందుకూరి-వీరేశలింగము.

శ్రీ చింతామణీ ముద్రాక్షరశాలలో వెలకుదొరకు పుస్తకములు.

రావుబహదూరు కందుకూరి-వీరేశలింగముగారిచే రచియింపఁబడినవి.

నాటకములు. (అంచెకూలితో)	రు.	అ.	పై.
౧. అభిజ్ఞాన శాకుంతలము - (కాళిదాసుని నాటకమునకు తెలుఁగు)	౦	౧౩	౦
౨. రత్నావళి (శ్రీహర్ష దేవవిరచిత సంస్కృత నాటకమునకు తెలుఁగు)	౦	౬	౬
౩. మాళవికాగ్నిమిత్రము- (కాళిదాసప్రణీత నాటకమునకు తెలుఁగు)	౦	౬	౬
౪. ప్రబోధచంద్రోదయము - (కృష్ణమిశ్రుని నాటకమునకు తెలుఁగు)	౦	౮	౬
౫. రాగమంజరి - (ఇంగ్లీషుననుసరించి తెలిఁగింపఁబడిన నాటకము)	౦	౮	౬
౬. కల్యాణకల్పవల్లి - ([illegible] పుటలుగల మిక్కిలిరమ్యమైన నాటకము)	౦	౮	౬
౭. ప్రహ్లాదనాటకము - (భక్తిప్రధానమైన వచనరూప నాటకము)	౦	౪	౬
౮. చమత్కారరత్నావళినాటకము	౦	౪	౬
౯. బ్రాహ్మవివాహము	౦	౩	౬
౧౦. వ్యవహారధర్మబోధిని.	౦	౩	౬
౧౧. వేశ్యాప్రియ ప్రహసనము.	౦	౩	౬
౧౨. కౌతుకవర్ధని- (హాస్యప్రధానమయిన చిన్న నాటకము). ...	౦	౨	౬
౧౩. వినోదతరంగిణి.	౦	౨	౦
౧౪. హాస్యసంజీవని, మొదటిభాగము.	౦	౪	౬
౧౫. హాస్యసంజీవని, రెండవభాగము.	౦	౪	౬
౧౬. హాస్యసంజీవని, మూడవభాగము.	౦	౪	౬
౧౭. తిర్యగ్విద్వన్మహాసభ, మూషకాసురవిజయము-బొమ్మలతోనున్నది.	౦	౨	౬
౧౮. మహారణ్యపురాధిపత్యము- (బొమ్మలతోనున్నది). ...	౦	౩	౬
౧౯. వెనిసువర్తకచరిత్రము (ద్విపద ప్రథమ ద్వితీయాంకములు) ...	౦	౪	౬
౨౦. కలిపురుష శనైశ్చరవిలాసము.	౦	౨	౬
౨౧. వివేకదీపిక - (శ్రీ) పునర్వివాహ నాటకము మొదటిమూడంకములు.)	౦	౪	౬
౨౨. సత్యహరిశ్చంద్రనాటకము.	౦	౮	౬
౨౩. దక్షిణగోగ్రహణ నాటకము.	౦	౬	౬
ఇంగ్లీషుననుసరించిన ప్రహసనములు.			
౨౪. అపూర్వబ్రహ్మచర్య ప్రహసనము.	౦	౨	౬
౨౫. విచిత్రవివాహ ప్రహసనము.	౦	౨	౬

౨౬. మహాబధిర ప్రహసనము. ౦ ౨ ౬
౨౭. పునర్మరణ ప్రహసనము. ౦ ౨ ౬
౨౮. బలాత్కార గానవినోద ప్రహసనము. ౦ ౨ ౬
౨౯. కలహప్రియా ప్రహసనము. ౦ ౨ ౬
౩౦. మహామహోపాధ్యాయ ప్రహసనము. ౦ ౨ ౬
౩౧. రోగనిద్రా ప్రహసనము. ౦ ౨ ౬
౩౨. మహానంచక ప్రహసనము. ౦ ౨ ౬
౩౩. అసహాయశూర ప్రహసనము. ౦ ౨ ౬

పద్యకావ్యములు.

౩౪. అభాగ్యోపాఖ్యానము-(పద్యరూపమునను‌న్న హాస్యప్రబంధము) ౦ ౨ ౬
౩౫. శుద్ధాంధ్రనిరోష్ఠ్య నిర్వచన నైషధము (అచ్చతెలుఁగు) ... ౦ ౪ ౬
౩౬. రసికజనమనోరంజనము- (అచ్చతెలుఁగు శృంగారప్రబంధము.) ౦ ౬ ౬
౩౭. శుద్ధాంధ్ర భారతసంగ్రహము. ... ...
౩౮. పథిక విలాసము. ౦ ౪ ౬
౩౯. జాన్ గిల్పిన్ కేళిగీతములు. ౦ ౧ ౬
౪౦. నీతిదీపిక-(బాలురనిమిత్తము చేయఁబడిన నీతిపద్యముల పుస్తకము) ౦ ౨ ౬

స్త్రీలకుపయోగపడు పుస్తకములు.

౪౧. స్త్రీనీతిదీపిక- (బాలికలనిమిత్తము చేయఁబడిన నీతిపద్యములు) ౦ ౨ ౬
౪౨. పత్నీహితసూచని. ౦ ౬ ౬
౪౩. సతీహిత బోధిని. ౦ ౬ ౬
౪౪. చంద్రమతీచరిత్ర- (స్త్రీలకుపయుక్తమయిననీతిబోధక పుస్తకము) ౦ ౪ ౬
౪౫. సత్యవతీచరిత్ర- (స్త్రీలకావశ్యకమయినచరిత్ర). ... ౦ ౪ ౬
౪౬. సత్యసంజీవని- (స్త్రీలకుపయోగించెడు నీతిబోధకమయినకథ). ౦ ౪ ౬
౪౭. సత్యాద్రౌపదీ సంవాదము, మాతృపూజ, పితృపూజ. ... ౦ ౧ ౬
౪౮. దేహారోగ్యధర్మబోధిని-శరీరారోగ్యధర్మములబోధించుపుస్తకము. ౦ ౪ ౬

షేక్స్పియరు నాటకకథల ననుసరించి వ్రాయఁబడిన కథలు.

౪౯. చమత్కార రత్నావళి. ౦ ౨ ౬
౫౦. కురంగేశ్వరవర్తక చరిత్రము. ౦ ౨ ౬
౫౧. కళావతీ పరిణయము. ౦ ౨ ౬
౫౨. గయ్యాళిని సాధుచేయుట. ౦ ౨ ౬
౫౩. రఘుదేవరాజీయము. ౦ ౩ ౦

౫౪. చిత్రకేతు చరిత్రము.	౦	౨	౦
౫౫. సుమిత్ర చరిత్రము.	౦	౨	౦
౫౬. దానకేసరి విలాసము.	౦	౨	౬
౫౭. సతీమణీ విజయము.	౦	౨	౦
౫౮. వైదర్భీ విలాసము.	౦	౨	౬
౫౯. భానుమతీ కల్యాణము.	౦	౨	౬
౬౦. సరసజన మనోభిరామము.	౦	౨	౬
౬౧. కుమారద్వయవిలాసము.	౦	౨	౬
౬౨. ధర్మకసచోపాఖ్యానము.	౦	౨	౬
౬౩. పద్మినీప్రభాకరము.	౦	౨	౬
౬౪. మాలతీమధుకరము.	౦	౨	౬

ఉ ప న్యా స ము లు.

౬౫. వేశ్యాకాంతల యుపన్యాసము.	౦	౨	౦
౬౬. అతిబాల్య వివాహము.	౦	౨	౦
౬౭. విగ్రహారాధనము.	౦	౨	౦
౬౮. ఐకమత్యము.	౦	౧	౬
౬౯. ఈశ్వరదత్త పుస్తకములు.	౦	౨	౦
౭౦. దానములు.	౦	౧	౬
౭౧. స్త్రీపునర్వివాహచరిత్ర.	౦	౨	౦
౭౨. స్త్రీపునర్వివాహవిషయకోపన్యాసము.	౦	౨	౬
౭౩. స్త్రీపునర్వివాహవిషయక ప్రథమవిజ్ఞాపనము.	౦	౨	౬
౭౪. స్త్రీపునర్వివాహవిషయక ద్వితీయవిజ్ఞాపనము.	౦	౨	౬
౭౫. స్త్రీపునర్వివాహ శాస్త్రసంగ్రహము.	౦	౩	౬
౭౬. స్త్రీపునర్వివాహ వ్యాపారముయొక్క భూతవర్తమాన స్థితులు.	౦	౧	౬
౭౭. సహాయకష్టకర్తలు.	౦	౨	౬
౭౮. దేశీయమహాసభయు దానియుద్దేశములును.	౦	౪	౬
౭౯. జన్మాంతరము.	౦	౨	౬
౮౦. స్వయంకృషి.	౦	౨	౬
౮౧. ఈశ్వరోపాసనము.	౦	౨	౬
౮౨. శంకరాచార్యులు.	౦	౧	౬
౮౩. హిందూమతములు.	౦	౧	౬
౮౪. ప్రార్థన	౦	౧	౬

౮౫. మానవధర్మము.	౦	౨	౦
౮౬. విద్యార్థికుల ధర్మములు.	౦	౨	౬
౮౭. వర్ణము.	౦	౨	౬
౮౮. మనుష్యజీవితముయొక్క పరమార్థము, దానినిపొందుమార్గము.	౦	౨	౬
౮౯. వైరాగ్యము.	౦	౨	౦
౯౦. విద్యార్థినీజనుల యర్హకృత్యములు.	౦	౨	౬

వివిధ పుస్తకములు.

౯౧. జ్యోతిశ్శాస్త్రసంగ్రహము౧౨౦ పుటలుగలదిపటములతో నున్నది.	౧	౨	౦
౯౨. శారీరశాస్త్రసంగ్రహము.	౧	౨	౦
౯౩. జంతుస్వభావచరిత్రము.	౦	౧౧	౦
౯౪. ఆంధ్రకవుల చరిత్రము, మొదటిభాగము- ౧౫౦ పుటలుగలది.	౧	౨	౦
౯౫. ఆంధ్రకవులచరిత్రము, ద్వితీయభాగము- ౧౯౪ పుటలుగలది.	౧	౨	౦
౯౬. ఆంధ్రకవుల చరిత్రము, తృతీయభాగము.	౧	౬	౦
౯౭. వివేకవర్ధని, మొదటిభాగము.	౦	౬	౬
౯౮. వివేకవర్ధని, రెండవభాగము.	౦	౬	౬
౯౯. వివేకవర్ధని, మూడవభాగము.	౦	౯	౦
౧౦౦. స్వదేశసంస్థాన చరిత్రాదులు.	౦	౬	౬
౧౦౧. ఉపన్యాసమంజరి.	౦	౬	౬
౧౦౨. ఆంధ్రతర్క సంగ్రహము.	౦	౧	౬
౧౦౩. సంగ్రహవ్యాకరణము.	౦	౫	౬
౧౦౪. కావ్యసంగ్రహము.	౦	౨	౦
౧౦౫. నీతికథామంజరి- ప్రథమభాగము (పటములతో) ...	౦	౯	౦
౧౦౬. నీతికథామంజరి- ద్వితీయభాగము (పటములతో) ...	౦	౯	౦
౧౦౭. నీతిచంద్రిక విగ్రహము.	౦	౧౨	౬
౧౦౮. నీతిచంద్రిక సంధి.	౦	౬	౬
౧౦౯. రాజశేఖర చరిత్రము.	౧	౨	౦
౧౧౦. సత్యరాజాపూర్వ దేశయాత్రలు మొదటిభాగము. ...	౦	౬	౬
౧౧౧. సత్యరాజాపూర్వ దేశయాత్రలు రెండవభాగము. ...	౦	౬	౬
౧౧౨. శ్రీ విక్టోరియా మహారాజ్ఞీగారి చరిత్రము	౦	౬	౬

పూర్వకవిప్రణీత గ్రంథములు.

౧. కవిరాజమనోరంజనము- (పురూరవశ్చరిత్ర).	౦	౯	౦
౨. మొల్లరామాయణము.	౦	౧౧	౦

౩. ప్రభావతీ ప్రద్యుమ్నము. ౦ ౧౩ ౦
౪. పాంచాలీ పరిణయము. ౦ ౬ ౬
౫. రామాభ్యుదయము. ౧ ౬ ౦
౬. యయాతి చరిత్రము. ౦ ౬ ౬
౭. విఘ్నేశ్వరము- (పద్యకావ్యము త్రికాండములు). ... ౦ ౫ ౬
౮. అధర్వణకారికలు. ౦ ౯ ౬
౯. ఉత్తరహరివంశము- (నాచనసోమనాథకవి ప్రణీతము.) ... ౧ ౬ ౦
౧౦. చిత్రభారతము. ౧ ౬ ౦
౧౧. పంచతంత్రము (నారాయణకవికృతము). ౦ ౧౩ ౦

పదిరూపాయలకంటె తక్కువకాని మొత్తమునకు పుస్తకములు కొన్నపక్షమున నాటికి పదిరూపాయలవంతున పుస్తకము అధికముగా నియ్యఁబడును. పుస్తకము లన్నియు మొత్తముగా నొకసారి కొనినయెడల పోష్టుకర్చులుగాక ఇరువది రూపాయలకే యియ్యఁబడును.

ఈక్రింది పుస్తకములు గిల్టుతక్షరములువేసి కాలికోగుడ్డతో నిండుగాబయిండు చేయఁబడినవి యీదిగువవెలలకు దొరకును.— (అంచెకూలితో.) రు. అ. పై.

నీతిరత్నామంజరి. (రెండుభాగములుకలిపి). ౧ ౪ ౦
శారీరశాస్త్రసంగ్రహము. ౧ ౪ ౦
జ్యోతిశ్శాస్త్రసంగ్రహము. ౧ ౪ ౦
జంతుస్వభావచరిత్రము. ౦ ౧౪ ౦
విక్టోరియా మహారాజ్ఞీచరిత్రము (20 పటములతో) పెద్దక్షరములది. ౦ ౧౩ ౦

గిల్టుతక్షరములులేక కాలికోగుడ్డతో బైండుచేయఁబడినవి.

చిత్రభారతము. ౧ ౮ ౦
మొల్లరామాయణము. ౪ ౧౩ ౪
సత్యవతీ చరిత్రము. ౦ ౭ ౦
కవులచరిత్రము మూడుభాగములు కలిసినది. ౩ ౮ ౦
నాచనసోముని ఉత్తరహరివంశము ౧ ౮ ౦
కవులచరిత్రము మూడవభాగము. ౧ ౮ ౦

☞ పయిపుస్తకములు కావలసినవారు, చెన్నపట్టణము, పరశువాకము, అదియప్పమొదలివీధి. ౪ నంబరు గృహమున శ్రీ చింతామణి ముద్రాక్షరశాల మేనేజరుగారికి వ్రాసి తెప్పించుకొనవచ్చును.